# అనుమానాలకు తావిచ్చే ఆచార్యుని ఆదేశం

- ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఒక ముస్లిం మహాత్ముడు 60మంది శిష్యులతో ఆశ్రమంలో నివసిస్తుండేవాడు. ఆయన యథాశక్తి వారందరికీ శిక్షణనిచ్చారు. ఇక ఒక నూతన అనుభవాన్ని పొందవలసి వున్నదని చెప్పి ఆయన వాళ్ళతో అన్నారు, “మనమొక సుదీర్ఘ యాత్రచేయాలి. ఇదమిద్ధమని నేనిప్పుడు నిశ్చయించి చెప్పలేనిదేదో దారిలో సంభవిస్తుంది. నూత్న బోధను గ్రహించగల పరిపాకాన్ని పొందినవారు మాత్రమే నాతో రాగలుగుతారు. కాని మొదట అట్టివారు, ‘మా గురువు బదులు నేనే మరణిస్తాను’ అన్న వాక్యాన్ని వల్లించాలి. తరువాత అవసరమొచ్చినప్పుడు రెండుచేతులు పైకెత్తిన సమయంలో ఈ వాక్యాన్ని బిగ్గరగా చాటాలి.”

ఎక్కువ మంది శిష్యులు గురువుగారి సంకల్పంలోని నిజాయితీని శంకించి తమలోతాము గుసగుసలాడటం మొదలు పెట్టారు. చివరకు, ‘ముందెప్పుడో తనకొక ప్రాణాపాయం రానున్నదని తెలిసి, తన బదులు మనను బలి చేయాలని చూస్తున్నాడు!’ అంటూ 59 మంది శిష్యులు ఆయనను విడిచివెళ్ళిపోయారు. ‘బహుశ: హత్యవంటి దుష్కార్యాన్నేదో మీరు తలపెట్టి ఉండాలి! ఇటువంటి షరతులకు మేము సమ్మతించము’ అని నిందించి మరీ పోయారు.

గురువు, ఒక్క శిష్యుడు ప్రయాణం చేస్తున్నారు. వారు ప్రవేశించడానికి కొద్ది సమయం ముందు ఒక క్రూరుడు ప్రక్క నగరానికిరాజై ప్రజలను భయం ద్వారా అదుపులో పెట్టాలని తలచి తన భటులతో, దారినిపోయే అమాయకుడినెవడినైనా న్యాయస్థానానికీడ్చుకు రండి. వాడినేదో నెపం మీద ప్రజల ఎదుట కఠినంగా శిక్షించాలి’ అని ఆజ్ఞాపించాడు. ఆ భటులకు ఈ ఒక్క శిష్యుడూ దొరికాడు. వారతనిని ప్రజల ఎదుట రాజు ముందు పడవేశారు. రాజు,“నీవంటి సోమరిపోతులను సహించబోము. నీకు మరణదండన విధిస్తున్నాను” అని గర్జించాడు. వెంటనే గురువు ‘మహారాజా! అతడలా అవడానికి కారణమైన నన్ను దండించండి!’ అని పైన వల్లించమన్న వాక్యాన్ని అరచి తన రెండు చేతులూ పైకెత్తాడు. వెంటనే శిష్యుడు కూడ అలానే అరచాడు. రాజు ఆశ్చర్య చకితుడై దిక్కుతోచక మంత్రుల సలహాకోరాడు. వారు, ‘ప్రజలలో ఈ ధోరణి ప్రబలితే మనమేం చేయగలం? ముందువారలా అనడానికి కారణం తెలుసుకోండి!’ అన్నారు.

కారణమడిగిన రాజుతో గురువిలా అన్నాడు, “రాజా! ఈరోజిక్కడ ఒక వ్యక్తి మరణించవలసి వున్నదని అతడు కొంత కాలానికి మరలా జీవించి మరణరహితుడై శాశ్వతంగా జీవిస్తాడనీ నాకొక దివ్యవాణి తెలిపింది. ఆ వ్యక్తి నేను కావాలంటే నేను కావాలని మేమిద్దరమూ పోటీపడుతున్నాము.”

దుష్టుడైన ఆ రాజు అట్టి అమరత్వాన్ని తానే పొందదలచి తనకే శిరశ్ఛేదం చేయవలసిందిగా భటులనాజ్ఞాపించారు. ఆ విధంగా రాజ్యానికంతటికీ మహావిపత్తు తొలగి పోయింది.

సద్గురుని ఆజ్ఞ శిష్యునికేకాక సర్వులకూ ఎప్పుడూ శ్రేయోదాయకమే! ‘సర్వధర్మాన్ పరిత్యజ్య’ అన్న వైఖరి ఒక్కటే శ్రేయోదాయకము.

ఈ గురువు తెలివిగా బొంకాడనుకొంటే పొరపాటు. గురువాజ్ఞను శిరసావహించి మరణాన్నైనా ఎదుర్కొనడానికి సిద్ధపడిన శిష్యుడు మాత్రమే శాశ్వతపదవిని పొందుతాడన్నది ఒక సాంకేతికమైన ఆధ్యాత్మిక సత్యం. జీవత్వం నశించాకనే గదా బ్రహ్మత్వం సిద్ధించేది? మరణమంటే అహంకారనాశనం.

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

SRI MANGA BHARDWAJA TRUST

చీఫ్ ఎడిటర్: **శ్రీ పోలూరి శ్రీనివాసరావు** బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: **డా॥ ఆర్.ఎస్. శశిధర్,** పిహెచ్. డి

**సంపుటి: 28** **ఫిబ్రవరి 2011** **సంచిక: 10**

ఉత్తమ గురుభక్తునికి తన గురువే సకల దేవతలు. కష్టాలలోనూ, కోరికలతోనూ, తమనాశ్రయించిన వారికి తన గురువునాశ్రయించి అనుగ్రహాన్ని పొందమని చెబుతారు. కానీ ఒక్కొక్క కోరిక సిద్ధించడానికి ఒక్కొక్క మంత్రం జపించమని, స్తోత్రం పఠించమని, వ్రతశాంతులు జరిపించమనీ అజ్ఞానయుతమైన సలహాలివ్వరు. దేవతలు వేర్వేరనేది రజోగుణ ప్రధానమైన అజ్ఞానమనీ, ఎవరేదేవతలను కొలిచినా వారిననుగ్రహించే దైవమొక్కటేనని, ఇట్టి జ్ఞానం సాత్వికమైనదనీ భగవద్గీత స్పష్టంగా చెబుతుంది.

**- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ**

Feb 9th ఆచార్య భరద్వాజులు శిరిడీలో సాయి సన్నిధిలో పరమాత్మానుభూతిని పొందిన పర్వదినం. ఆ సందర్భంగా "సాయిబాబా" పాఠకులకు శ్రీ సాయి ఆశీస్సులకై ప్రార్థన.

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు. శ్రీ మంగభరద్వాజ ట్రస్టుకు ఎటువంటి బాధ్యతా లేదు.

## విషయసూచిక

1. అనుమానాలకు తావిచ్చే ఆచార్యుని ఆదేశం 01
2. మతగ్రంథాలు–వాటి పుట్టుక 03
3. పూజ ఎందుకు? ఎలా చేయాలి? 05
4. మానవత్వమా?...... దైవత్వమా? 10
5. గరుడ పురాణంలో ఆధ్యాత్మ బోధ 13
6. శ్రీ సాయి సచ్చరిత్ర 15
7. శ్రీ దత్తలీలామృతము 17
8. వార్తాలాపము – సీరియల్ 20
9. తాత్యా డైరీ 22
10. శ్రీ భరద్వాజ రచనామృతం 25
11. సర్వము తానైన శ్రీ సాయినాథ జై జై ! సాయియే తానైన శ్రీ భరద్వాజ జై జై !! 28

**చందా వివరములు**

| | |
|---|---|
| విడిప్రతి | : రూ. 10-00 |
| సంవత్సర చందా | : రూ. 100-00 |
| జీవిత చందా | : రూ. 1,116-00 |
| (సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును) | |
| (20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది) | |
| రాజపోషకులు | : రూ. 3,000-00 |
| మహారాజపోషకులు | : రూ. 5,000-00 |

**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P,Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500 068
website: www.saibharadwaja.org
www.saimasterforums.org

"సూర్య చంద్రాదులున్నంత వారకు నా అవతార కార్యము కొనసాగుతూనే వుంటుంది".

# మతగ్రంథాలు–వాటి పుట్టుక

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

ప్రపంచంలోని సర్వమతాలు తాము కొందరు మహాత్ముల దివ్యానుభవాల నుండి ఉత్పన్నమయినట్లు చెబుతాయి. 'ఖురాన్' మహమ్మదుగారికి కల్గిన దివ్యావేశంలో దైవమే ఆయన నోటి ద్వారా మాట్లాడినట్లు చెప్పబడినట్లు వుంది. తన దేశంలోనూ, సాటి దేశాలలోనూ విగ్రహారాధన, క్రైస్తవులలోని చీలికలు, తగవులు, మానవులలోని కుత్సితాలు చూచి ఆయనకు ఏవగింపు కల్గి నిర్దుష్టమైన సత్యాన్ని తెలుసుకోడానికాయన హిరా పర్వత గుహలో సంవత్సరాల పర్యంతమూ ప్రార్థన, ధ్యానాలలో కాలం గడిపారు. మొదట ఆయనకు స్వప్నాలు కలిగాయి. క్రమంగా స్వప్నంలో కనిపించిన ప్రతిదీ వాస్తవం కాజొచ్చింది. చివరికి ఒకరోజున పెద్దవెలుగు ఆయన హృదయం ముందు నిలచి ఆయన ప్రవక్తయనీ, నూత్న మార్గాన్ని మానవాళికి బోధించమనీ ఆదేశించింది. ఆ మాటలు విన్న ఆయనెంతో భయాన్ని చెంది, వణుకుతూ యిల్లు చేరారు. ఆయన పవిత్రంగా జీవితాన్ని గడుపుతున్నారు గనుక దైవం ఎన్నడూ ఆయుననలా వంచించరని ఆయన భార్య ఖదీజా ఊరడించింది. చాలాకాలం ఏదో దుష్టశక్తి తననలా తిరుగుబాటుకు, కల్లోలానికి ప్రేరేపిస్తుందని తలచారు. ఒకనాడు ఆ వాణి ఆయనను 'పఠించు' అని ఆదేశించింది. 'నాకు చదువురాదు' అన్నారాయన. భగవంతుడు ఆయనకు అద్భుతరీతిన చదువగల సామర్థ్యాన్నిస్తారని వినిపించింది. తరువాత ఒకసారి ఆ వాణి "నీవు ప్రవక్తవు; నేను జిబ్రాయిల్" అని చెప్పినది. నిరక్షరుడైన మహమ్మదుల ద్వారా ధారాళంగా ప్రకటమైన 'ఖురాన్'లోని వాక్యాలవంటివాటిని అరబ్బీలో ఆరితేరిన పండితులు సైతం వ్రాయలేరట! ఈ అనుభవమే ఇస్లాముకు మూలము.

క్రైస్తవంలో పాతగ్రంథమంతా తమ జీవితాలను ధ్యాన తపస్సులలో గడిపిన ప్రవక్తల ప్రవచానాలే. మోసేస్‌గారికి కూడా పర్వతం మీద తేజోరూపములో దైవం దర్శనమిచ్చి పది ధర్మాలను బోధించారు. ఆ దర్శనానంతరం ఆయన ముఖంలో జనులు చూచి భయపడేటంతటి కాంతి ప్రకటమయ్యేదట! ఆయనలో ఎన్నో మహిమలు కూడా ప్రకటమయ్యాయట. అలానే క్రీస్తు యొక్క అద్భుత జననము, మహిమలవలన ఆయన మతముత్పన్నమైంది.

సిద్ధార్థుడు దు:ఖానికీ, మరణానికీ కారణాన్నన్వేషించడానికి రాజ్యాన్ని చివరకు భార్యాబిడ్డలను గూడా విడచి భిక్షువై ఘోర తపస్సులు చేసి చివరికి బోధివృక్షం క్రింద జ్ఞానోదయమై బుద్ధుడైనాడు. ఆ అనుభవసారమే బౌద్ధమతమైంది. ఇంకా ప్రాచీన యుగాలలో తపస్వులైన మహర్షులకు తపస్సు ఫలితంగా యోగస్థితిలో వేదాలు ప్రకటమై వారి ద్వారా వేదాలు వెల్లడైనాయి.

**ఈ పవిత్ర గ్రంథాలన్నీ దివ్యానుభవాలవల్ల ఉత్పన్నమైనాయని విశ్వసించడమెలా? ఇప్పటికే యిటువంటి అనుభవాలు పొందిన మహనీయులు- రామకృష్ణ పరమహంస, రమణమహర్షుల వంటి వారి అనుభవాలే!**

ఈ పవిత్ర గ్రంథాలన్నీ దివ్యానుభవాలవల్ల ఉత్పన్నమైనాయని విశ్వసించడమెలా? ఇప్పటికే యిటువంటి అనుభవాలు పొందిన మహనీయులు- రామకృష్ణ పరమహంస, రమణమహర్షుల వంటి వారి అనుభవాలే! 30, డిసెంబరు 1879 తిరుచ్చుళిలో జన్మించిన వెంకట్రామన్ తన 16వ సంవత్సరంలో ఒకరోజున ఆకస్మికంగా మరణానుభవాన్ని పొందారు. సహాయానికెవర్నీ పిలచే సమయం లేనందున మరణించడమంటే ఏమి జరుగుతుందో గమనిస్తూ వుండిపోయారు. శరీరం కొయ్యబారడం, గుండె, శ్వాస ఆగడం కూడా గమనించి "శరీరం మరణించినా కూడా ఆ విషయాన్ని గుర్తించే గుర్తింపు వున్నదే!" అని ఆశ్చర్యపోయి, మరణించేది శరీరమేనని, నిజానికి అది తన మరణం కాదనీ,

తను కేవలం జనన మరణరహితమైన చైతన్యమేనని స్వానుభవంతో గ్రహించారు. తరువాత ఆయన యత్నం లేకనే ఆయన అరుణాచలంలో కొన్ని సంవత్సరాలు దేహాన్ని మరచి తపస్సులో వుండిపోయారు. తరువాత నిరక్షరుడైన ఒక సాధువుకు పుస్తకం చదవి పెట్టాలన్న సంకల్పంతో ఆయన అతడు తెచ్చుకున్న వేదాంత గ్రంథాలను చూచారు. సరిగ్గా తమకు కల్గిన అనుభవాలే వాటిలో వర్ణించబడివుండడం ఆయననెంతో ముగ్ధుణ్ణి చేసింది. ఏ వేదాంత పఠనమూ, సాధన, భక్తిలేని వెంకట్రామనుకు స్వానుభవంతో ఉపనిషత్సత్యం ప్రకటం కావడం ఉపనిషత్తులటువంటి అనుభవాల ఫలితాలేనని ఋజువుకాలేదూ? ఆయనను దర్శించిన పాశ్చాత్యులు కూడా ఆయన సన్నిధిలో పరమశాంతిని పొందారు. క్రీస్తుతో పోల్చారు. జంతువులు సైతం ఆయన సన్నిధిలో విశేషప్రజ్ఞతో మెలిగేవి!

వీరి శిష్యులలో మహాపండితుడు యోగి అయిన 'కావ్యకంఠ' వాశిష్ఠగణపతి యొకరు. ఆయనకు దైవరాయడను శిష్యుడున్నారు. ఆయన

**ఆయన యోగస్థితిలో నిమగ్నులై వున్నప్పుడు ఆయన నోటివెంట ప్రయత్నము, ఎరుకలేకనే వేదమంత్రాలవంటివి వినవచ్చేవి. సాటివారు వాటిని వ్రాసుకున్నారు. అవి స్వరంలోను, పదజాలంలోను, ఛందస్సులోను, వ్యాకరణంలోను భావగాంభీర్యంలోనూ వేదమంత్రాలను పోలివుండడం మన దేశీయ వేదపండితులనేకాక జర్మనీలోని వేదపరిశోధకులను కూడా ఆశ్చర్యచకితులను చేసింది. అయితే అవి యింతవరకూ మనకు సాంప్రదాయకంగా వచ్చిన వేదాలలోనివి కావు!**

యోగస్థితిలో నిమగ్నులై వున్నప్పుడు ఆయన నోటివెంట ప్రయత్నము, ఎరుకలేకనే వేదమంత్రాలవంటివి వినవచ్చేవి. సాటివారు వాటిని వ్రాసుకున్నారు. అవి స్వరంలోను, పదజాలంలోను, ఛందస్సులోను, వ్యాకరణంలోను భావగాంభీర్యంలోనూ వేదమంత్రాలను పోలివుండడం మన దేశీయ వేదపండితులనేకాక జర్మనీలోని వేదపరిశోధకులను కూడా ఆశ్చర్యచకితులను చేసింది. అయితే అవి యింతవరకూ మనకు సాంప్రదాయకంగా వచ్చిన వేదాలలోనివి కావు! వాటి అర్థం కూడా దైవరాయలకు ఆయన గురువైన కావ్యకంఠులు వివరించి చెప్పవలసి వచ్చింది. ఇటీవల భారతీయ విద్యాభవన్‌వారు 'ఛందోదర్శనము' అను బృహద్గ్రంథంగా దానిని ప్రకటించినారు. జర్మన్ వేద పండితుల ప్రశంసలు కూడా తొలిపలుకులలో ప్రచురించబడ్డాయి.

ఇటువంటిదే మరొక్క అనుభవం. నేడు మన మధ్య 'ఆనందమాయి'గా ప్రసిద్ధిలో వున్న తల్లి, విద్యలేని సామాన్య గృహిణి. కాని ఆమెకు దివ్యానుభవాలు తమంతటవే కల్గేవి. ఆమె అప్రయత్నంగా ధ్యాననిమగ్నురాలుకావడం, అప్పుడామె నోటివెంట స్వచ్ఛమైన వేదమంత్రాలవంటి మంత్రాలు సస్వరంగా వెల్లడికావడం, ఆ సమయంలో ఆమె వర్చస్సు అతిలౌకకమైన కాంతిలో వెలిగిపోవడము భక్తులనాశ్చర్యపరచేదని ఆమెను కొన్ని శతాబ్దాలు సేవించిన జోతిష్‌చంద్రరే "Mother as Revealed to Me" అనే గ్రంథంలో వ్రాశారు.

ఇటువంటి దివ్యానుభవాలు విదేశాలలో ఎందరికో కల్గినట్లు విలియమ్ జేమ్సు "Varieties of Religious Experience" అను గ్రంథంలోనూ, ఎవలిన్ అండర్హిల్ "Mysticism" అను గ్రంథంలోనూ, మేడమ్‌బ్లావెట్‌స్కీ "Secret Doctrine"లోనూ వ్రాశారు. ఇన్ని దేశ, కాల, మతాల వారికొకేరకమైన అద్భుతానుభవాలు కలగడమే ఆధ్యాత్మికానుభూతి నిజమని చెప్పడానికాధారమని సామర్సెట్‌మామ్ అనే ప్రఖ్యాతాంగ్లరచయిత అంటారు. ఆల్డస్‌హక్స్లీ కూడా "Perennial Philosophy" లో అదే భావాన్ని వ్యక్తం చేశారు.

నేను శిరిడీలోనే వున్నాను, అని అనుకుంటే నన్ను అసలు చూడనట్టే.

# పూజ ఎందుకు? ఎలా చేయాలి?

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

సాయి పూజా విధానం శ్రీ సాయిపట్ల మనకు గల ప్రేమ, గౌరవాలను వ్యక్తం చేయడమే. అంటే మనలో నిజమైన ప్రేమ, గౌరవం, శ్రద్ధా ఆయనపై ఎంతగా వుంటాయో అంతగా మన పూజ సార్ధకం అవుతుంది. కనుక సాయి లీలలను పారాయణచేసి మన హృదయంలో సాయి యొక్క అద్భుత శక్తి పట్ల భక్తి శ్రద్ధలను పొందితే మనం సరిగా ఆయనను పూజించగలుగుతాము. అలా చేసేవారికి ధ్యానశ్లోకాలలో గాని, నామాలలోగాని బాబాలీలలు స్ఫురించి నిరంతరం వాటి స్మరణే జరుగుతుంది.

ఇక సంకల్పంతో ఆరంభించి వివిధ ఉపచారాలలో వ్యక్తం కావలసిన భావాన్ని, అన్ని ఉపచారాలతో కూడిన పూజ చేస్తున్నంతసేపూ నేపథ్య సంగీతంలాగ హృదయంలో వుండవలసిన భావాన్ని వివరిస్తాను.

సాధనలోని రహస్యం సర్వకాల సర్వావస్థల యందు కోసం తనకూ, తన చిత్రానికీ బేధం లేదని బాబా నిరూపించారు. కనుక ఆయన చిత్రపటాన్నింట్లో వుంచడం, ఈ సత్యాలు హృదయగతం కావడం కోసం "శ్రీ సాయి లీలామృతము" పారాయణ చేయడమూ మొదటిమెట్టు. తర్వాత ఆ రూపంలో ఆయనే వున్నారన్న గుర్తింపుతో సదా వర్తించుకోడం ముఖ్యం. మనం జీవితంలో దేనిని పొంద నిశ్చయించుకున్నామో ఆ లక్ష్యం ఆయనేనని హృదయానికి అనుక్షణము గుర్తుచేసేందుకది ఉపకరిస్తుంది. ఆయన ఉనికిని మనమిలా గుర్తిస్తుంటే ఆ యిల్లు ఆయన సాన్నిధ్యంవల్ల ఆధ్యాత్మిక శక్తిని పుంజుకుంటుంది.

ఇక ఈ భావన సదా మనస్సులో నిలవడానికి, లౌకిక క్రియా కలాపాలలో, భావనలో యిది మరుగుపడకుండా వుండడానికీ నిత్యం నిద్రలేవగానే ప్రాత:స్మరణ చేయడం ఆవశ్యకం. అది ఆనాడు మన మనస్సునెలా వుంచుకోవాలోనన్న విషయాన్ని గుర్తుచేసి మన పట్టుదలను పెంచుతుంది. అందుకే

**ఆయన చిత్రపటాన్నింట్లో వుంచడం, ఈ సత్యాలు హృదయగతం కావడం కోసం "శ్రీ సాయి లీలామృతము" పారాయణ చేయడము మొదటిమెట్టు.**

మనస్సు ధ్యేయరూపమై వుండడమే. అదే మొదట సగుణ సాక్షాత్కారానికి తర్వాత నిర్గుణ నిరాకార ఆత్మానుభూతికీ దారి తీయగలదని శ్రీ రామకృష్ణ పరమహంస చరిత్ర ఋజువు చేస్తుంది.సాయికూడా తమ సాధన గురించి అదే చెప్పారు. మొదటనే నిర్గుణసాధన చాలా కష్టతరమనీ, భక్తి చాలా సులభమనీ గీత కూడా చెబుతుంది.

సాయిబాబాను సదా మనస్సునందుంచుకొని, ఆయన సాన్నిధ్యాన్ని భావన చేయడమే సాధన. ఇది సర్వకాల సర్వావస్థలయందు జరిగేలా ముముక్షువులు చూచుకోవాలి. (ముముక్షువంటే మోక్షం కోరేవాడు. మోక్షమంటే అజ్ఞానమైన, దు:ఖదాయకములైన బంధాల నుండి ముక్తి, ''నేను దేహపరిమితుడైన మానవుణ్ణి" అన్న భావననుండి ముక్తి; ("నేను, ఆ పరమాత్మ ఒక్కటే" అనే జ్ఞానాన్ని పొందడమే.)

శ్రీ సాయి తన భక్తులు తనను భక్తి శ్రద్ధలతో స్మరించిన క్షణంలో వారి చెంతనే వుంటానని వాగ్దానం చేసారు. అది నిజం. కారణం వారు సర్వవ్యాపియై, సర్వరూపాలలోనూ సర్వదా వున్నారని వారి లీలలు నిరూపిస్తున్నాయి. ఈ విషయం వారి సమాధి అనంతరంగూడా యదార్ధమని నిరూపించే లీలలు అసంఖ్యాకంగా వున్నాయి. అయితే తన భక్తులు సాధన సౌలభ్యం ముందర 'ప్రాత:స్మరణ' లేక ఉదయ ప్రార్థన పొందుపరచడం జరిగింది.

తర్వాత కాలకృత్యాలు తీర్చుకునేప్పుడు కూడా - ఉదాహరణకు స్నానం చేసేప్పుడు ఈ నీటిరూపంలో కూడా సర్వగతమైన బాబా శక్తియే వున్నదన్న గుర్తును వహించి దానితో మన అశ్రద్ధను, ఏమరుపాటును తొలగించుకోడానికి స్నానం సంకేతం కావాలి - బాబా చింతనకు దోహదమైన భావాలను అభ్యసించాలి.

స్నానానంతరం పూజకు కూర్చున్నప్పుడు మొదట సంకల్పం చెబుతాము. ఎటూ పూజ చేయబోతూ 'పూజ చేయబోతున్నాను' అని మంత్రరూపంలో చెప్పడం ఎందుకు? అనిపించవచ్చు. కాని యోచిస్తే తప్ప ఋషులు దానినెందుకు వ్యవస్థీకరించారో తెలియదు. ఒకటి రెండు ఉదాహరణలు:

మనం శ్రద్ధగా ధ్యానించుకోవాలని కూర్చుంటే కొన్ని నిముషాల్లో మనం ఇతర ఆలోచనల్లో మునిగి కూర్చున్న లక్ష్యాన్నే మరుస్తాము. కొద్ది సేపటిగ్గాని 'ఏమిటి! ధ్యానం చేద్దామని కూర్చొని యిలా ఆలోచిస్తూ కూర్చుంటానేమిటి?' అని ఆశ్చర్యపోతాము. అలానే జీవితంలో జీవ శాస్త్రాధ్యయనం చేసి గొప్పగా ఉత్తీర్ణులమై డాక్టరవుదామన్న ఆశతో కళాశాలలో

ఇంటర్మీడియట్‌లో చేరామనుకోండి, క్రమంగా పరిచయాలు ఇతర విషయాలపై ఆసక్తి పెరిగి, మన పట్టుదల సడలి చివరికి ప్యాసైతేచాలు అనే స్థితికి వస్తాము. అలా గాకుండా ఆ లక్ష్యాన్ని నిలుపుకొనేవారెంత స్వల్పసంఖ్యలో వుంటారో చూస్తే తెలుస్తుంది.

కనుక మొదట సంకల్పం బలంగా వుంటే ఇతర వ్యామోహాలు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు మనమే

**మనస్సు లక్ష్యముమీదనుంచి ప్రక్కకు పరుగెత్తడానికి గల కారణం ఏ విషయాల మీదకది పరుగెడుతుందో వాటిపై మనకు గల ఇష్టాయిష్టాలే.**

తీసుకుంటాము. లేకుంటే ప్రక్కదారి పట్టి అసలు లక్ష్యం మరుగైపోతుంది. అంతేగాక, మొదట గట్టి సంకల్పమున్నా మరుగుపడకుండా వుంటాలంటే తరచూ మన మనస్సును మన పరమలక్ష్యము వైపుకు మనమే తరచుగా మరలా మరలా ప్రోత్సహించుకోవాలి. అలా నిత్యమూ బలంగా మన మొదటి లక్ష్యమైన ముముక్షుత్వాన్ని బలపరచుకోడానికే నిత్యపూజలో సంకల్పమొకభాగం కావలసి వుంటుంది.

ఇంకొక విషయం. మనస్సు లక్ష్యముమీదనుంచి ప్రక్కకు పరుగెత్తడానికి గల కారణం ఏ విషయాల మీదకది పరుగెడుతుందో వాటిపై మనకు గల ఇష్టాయిష్టాలే. వాటిపై మనకుండే భావాన్ని మనకున్న లక్ష్యపరంగా మలచుకుంటే అవి మనకు లక్ష్యాన్ని గుర్తుచేసేవిగా రూపొంది నిత్యజీవితంలో తారసిల్లే విషయాలు కూడా మనలను అనుక్షణము మన లక్ష్యంవైపుకు ఉన్ముఖం చేసేవిగా మారుతాయి. అందుకే వస్తువులు, వ్యక్తులు, ప్రాణులు వేరువేరుగా, మననుండి వేరుగా మనకెలా అనుభవమవుతాయో అవి అలానే వున్నాయనుకోవడమే వాటిపై లౌకికమైన ఇష్టాయిష్టాలకు కారణం. అవే మనలను లక్ష్యం నుండి వాటివైపుకు మళ్ళించేది. అందుకే సంకల్పం చెప్పే మంత్రంలో ఈ చరాచరవిశ్వమంతా సర్వవ్యాపక చైతన్యశక్తియైన విష్ణువుయొక్క ఆజ్ఞానుసారం ఆ చైతన్యంలో మనస్సులో భావంలా ఏర్పడతాయని, కల్పాలు, మన్వంతరాలు, యుగాల దగ్గరనుండి ధ్యానించే క్షణం వరకూ వున్న కాలము, ద్వీపాంతాల నుండి మన స్వగృహం వరకూ వున్న ప్రదేశాలూ ఆయన సంకల్పాలని, వీటన్నింటి రూపంలో ఆ చైతన్యమే వున్నదనీ మనలోనూ ఆ కారణంగా వ్యాపించియున్న ఆ చైతన్యం మనకు ప్రసన్నమై సాక్షాత్కరించడానికై మనం ధ్యానించి పూజిస్తున్నామనీ గుర్తుచేసేదిగా వుంటుంది. అన్ని దిక్కులా బాహ్యంగా వ్యాపించి, మన శరీరం రూపంలోనూ అదే వున్నదన్న భావం కలిగేందుకు అంగన్యాస కరన్యాసాలు పూజావిధానంలో వుంటాయి. నిత్యపూజతో ఈ భావం బలపడ్డాక ఇక 'నేను' అంటూ ఈ విశ్వచైతన్యం నుండి వేరే ఏముందీ అన్న వివేకం మేల్కొని, 'నేనుగా ఇప్పుడనుభవమయ్యే చైతన్యమదే' అన్న స్థితి క్రమంగా అభ్యాసవశాత్తు కలుగుతుంది. ఇలా అన్నిదిక్కులా అదే వున్నదన్న భావం దృఢపడి, ఏ దిక్కునున్న ఏ విషయాలు మనస్సున ప్రవేశించకుండా చేసిన భావబంధమే 'దిగ్బంధము'.

ఆధునిక విజ్ఞానాన్నార్జించినవారికి భౌతిక శాస్త్రరీత్యా సృష్టిలోని నానాత్వానికాధారంగా ఏకత్వమున్నదన్న నిశ్చయం కలిగిన పామరదృష్టిని అతిక్రమించడానికుపకరించే లాగ 'ఏది నిజం?' వ్రాసి ప్రచురించవలసి వచ్చింది. భౌతిక, నాస్తిక వాదాలెలా నిరాధారాలో, ఈ విషయాన్నే విదేశాలలోని అత్యాధునిక పరిశోధనలు ఎలా నిరూపిస్తున్నాయో తెలుపడంకోసం 'విజ్ఞాన వీచికలు' వ్రాయడం జరిగినది. ఆ పుస్తకాలనప్పుడప్పుడు పరిశీలిస్తుంటే సాధన బలపడుతుంది. దీనినే మన పూర్వీకులు తత్త్వచింతనన్నారు. తత్త్వ చింతన, భక్తి కలిసే కొనసాగాలని శాస్త్రం.

**నిత్యపూజతో ఈ భావం బలపడ్డాక ఇక 'నేను' అంటూ ఈ విశ్వచైతన్యం నుండి వేరే ఏముందీ అన్న వివేకం మేల్కొని, 'నేనుగా ఇప్పుడనుభవమయ్యే చైతన్యమదే' అన్న స్థితి క్రమంగా అభ్యాసవశాత్తు కలుగుతుంది.**

ఈ సంకల్పంలోని ఆధ్యాత్మిక సత్యమే మూర్తీభవించి మన కొరకు శ్రీ సాయిగా వెలసి చిత్రరూపంలో వున్నదని ఆయన చరిత్ర గుర్తించేలాగ చేస్తుంది. ఇక 6 ఉపచారాలు చేస్తున్నంతసేపూ మన హృదయంలో అంతటి సర్వజ్ఞుడు, సర్వవ్యాపి అయిన మహనీయుడు మన ఎదుట ఈ రూపంలో వున్నారు అన్న భావన మణిమాలలోని సూత్రంలా చెదరకుండావుండాలి. అభ్యాసంతో ఇది కుదురుతుంది. ఆ చెదరని భావనే ధ్యానం. పూజానంతరం ఉపచారాలు మాని ఆ భావాన్నే హృదయమంతటితోనూ పొందివుండడమే ధ్యానం. పూజాంతరంలో ధ్యానం కొనసాగించకపోవడం, అన్నం వండుకొన్నాక తినక పోవడం లాంటిది.

సంకల్పం భావయుక్తంగా చెప్పుకొన్నాక 'అపవిత్ర: పవిత్రోవా' అన్న శ్లోకంలో తానుకూడా విశ్వరూపం ధరించిన భగవచ్ఛక్తిమయుడన్న గుర్తింపుతో బాహ్యాభ్యంతరాలలో పవిత్రుడనని గుర్తించాలి. తర్వాత ధ్యాన శ్లోకం భావచింతనతో

పఠించి మనస్సున ఆ భావాన్ని నిలుపుకోవాలి. అదే హృదయంలోకి ధ్యానరూపంలో గురుమూర్తిని ప్రేమ, గౌరవాలతో ఆహ్వానించడం. ఆహ్వానించడమే ఆవాహనంటే. మనకు ప్రేమపాత్రులైనవారు గుర్తుకొచ్చినప్పుడు ఆ స్మృతులను ప్రేమతో హృదయంలో ఎలా స్వీకరిస్తామో అలానే సాయి సాన్నిధ్యాన్ని హృదయంలోకి తీసుకొంటాము. అదే ఆవాహనం. ఆ గుర్తింపునే మనం ఆహ్వానించేది. కారణం గురువు సర్వగతుడు. ఆయనను ఎక్కడికని ఆహ్వానించగలం? ఆ భావాన్ని మనం పూజంతటికీ నేపథ్యంలో నిలుపుకోడానికి సంకేతమే ఆయనకు ఆసనం సమర్పించడమనే బాహ్యక్రియ. ఇంటికొచ్చిన పెద్దలకు వున్నతాసనమేసి సత్కరించినట్లు సాయి రూపాన్ని మన శ్రద్ధాపూర్వకమైన దృష్టిలోకి తీసుకోడం కోసం ఆసన సమర్పణప్పుడు వున్నతాసనం పై వారిని కూర్చోపెట్టినట్లు భావిస్తాము. ఉన్నతాసన సమర్పణం అంటే శ్రీ సాయి మనకంటే వున్నతమైన జ్ఞానస్థితిలో వున్నారన్న గుర్తింపు మనలో వుండానికి సంకేతం. ఇలా ప్రతి ఉపచారమూ మనకాయన పట్ల వున్న భక్తి, శ్రద్ధలకూ, ఆయన వున్నతస్థితికి సంబంధించినది కనుక ప్రతి ఉపచారానికి ముందు ఆయన స్థితిని, మన భావాన్నీ వర్ణించే శ్లోకముంటుంది. ఆ శ్లోకాన్ని భావయుక్తంగా స్మరించినప్పుడు పూజ యాంత్రికంగాగాక సజీవంగా జరుగుతుంది. మన యెదుట ఆయన వున్నారన్న భావాన్ని పొందగలుగుతాము.

**మనకు ప్రేమపాత్రులైనవారు గుర్తుకొచ్చినప్పుడు ఆ స్మృతులను ప్రేమతో హృదయంలో ఎలా స్వీకరిస్తామో అలానే సాయి సాన్నిధ్యాన్ని హృదయంలోకి తీసుకొంటాము. అదే ఆవాహనం. ఆ గుర్తింపునే మనం ఆహ్వానించేది. కారణం గురువు సర్వగతుడు. ఆయనను ఎక్కడికని ఆహ్వానించగలం? ఆ భావాన్ని మనం పూజంతటికీ నేపథ్యంలో నిలుపుకోడానికి సంకేతమే ఆయనకు ఆసనం సమర్పించడమనే బాహ్యక్రియ.**

హస్తములకు అర్ఘ్యమివ్వడమంటే–చేతులు కడగటంగా భావించవచ్చు. తరువాత ఆచమనం. నైవేద్యం యిస్తాము గనుక దానికి ముందు చేతులు, శరీరం కడుగుకోటం శ్రమను తగ్గించి శక్తి ఉత్సాహాలను కల్గిస్తుంది. మనస్తోత్రాలు, పూజలూ సాయిని ప్రసన్నులను చేస్తాయి అని భావం. దానిక్కారణం ఈ ఉపచారాల ద్వారా మనకున్న శ్రద్ధ ప్రకటం కావడమే. మంచి విద్యార్థియందు ఉపాధ్యాయుడెలా ప్రత్యేక శ్రద్ధాసక్తులను పొందుతాడో, అలానే శ్రద్ధాళువైన ముముక్షువు పట్ల సద్గురువు కూడ. ఉపచారాలలోని శ్రద్ధ, భక్తునిలో జ్ఞానం పట్లకల ఆకాంక్షను తెల్పుతుంది. దాని విలువ అతడికి తెలియడమే ఆ శ్రద్ధకు కారణం. పాదాలకు పాద్యము, స్నానము అని ఉపచారాల భావం ఇక్కడే వివరించడమైనది. స్నానోపచారం పూజలో ఎంతో విపులంగా చేసి రూప, గుణ చింతనెంతో బలపరచుకొనే అవకాశమున్నది.

**మనస్సుకొక లక్షణముంది. అది దేనిని భావిస్తే ఆ రూపాన్ని అల్పంగానో, అధికంగానో అభ్యాసాన్ని బట్టి పొందుతుంది. సద్గురుగుణ చింతనాత్మకమైన నామపఠన సద్గురుని తత్త్వంతో మన మనస్సును తాదాత్మ్యాన్ని చెందేలా చేస్తుంది.**

అంగపూజలో సద్గురువు తన అవయవాలనన్నింటిని భక్తుల శ్రేయస్సుకు వినియోగించే సద్గుణాలకు సంకేతాలుగా భావించి పూజిస్తాము. తర్వాత నామావళితో పూజ, లేక స్తోత్ర పఠన చేస్తాము.

ఈ స్తోత్రపఠన ఎందుకు? అన్నది సరిగా అర్థం చేసుకోవాలి. లేకుంటే ఇష్టదైవం ముఖస్తుతితో తృప్తిచెందే క్షుద్ర గుణవంతుడుగా గోచరించగలడు. తన ఎదుట ప్రత్యక్షంగా వున్న స్థూల రూపమే గురువు అన్న భ్రాంతి కలుగకుండా ఆ రూపంద్వారా మనకు వ్యక్తమయ్యే గురువుయొక్క అంతరంగికస్థితిని గుర్తించడమే దాని ప్రయోజనం. మనస్సు తను చింతించే విషయాలలో మార్పును కోరేదిగా వుంటుంది. దానినొకవంక తృప్తిపరచేందుకు వివిధ నామాలను భావయుక్తంగా పఠిస్తాము. కాని అన్ని నామాలు ఒక దైవస్వరూపానివే అయ్యుండడంవల్ల మనస్సుకు అనేక విషయాలనిస్తున్నట్లు భ్రమింపచేస్తూ ఒక్కదాని పైననే నిలిపేలాగ చేయడమే నామావళి ప్రయోజనం.

మనస్సుకొక లక్షణముంది. అది దేనిని భావిస్తే ఆ రూపాన్ని అల్పంగానో, అధికంగానో అభ్యాసాన్ని బట్టి పొందుతుంది. సద్గురుగుణ చింతనాత్మకమైన నామపఠన సద్గురుని తత్త్వంతో మన మనస్సును తాదాత్మ్యాన్ని చెందేలా

చేస్తుంది.

ఈ విధంగా నామ స్తోత్రం చేసిన భక్తుడి మనస్సు ఆ నామాల చేత పేర్కొనబడిన దివ్యగుణచింతనవల్ల తద్భావంపొంది, కేవల ప్రకృత అజ్ఞానపూరిత చింతనలనుండి పరిశుద్ధమయ్యాక మనస్సు సహజంగా ధ్యానానికి ఉన్ముఖమవుతుంది. అలా అయి ధ్యానం జరుగడాన్ని ఆత్మస్వరూపుడుగా హృదయంలో దాగియున్న తన ఇష్టదైవం యొక్క కృప ప్రసాదితమైనదని రూపకాలంకారంగా చెప్పబడుతుంది. కారణం భక్తుడి అనుభవం సరిగ అలానే వుంటుంది. ఇట్టి భావం వల్ల తన ధ్యేయవస్తువుపై భక్తి శ్రద్ధలు వృద్ధి అయి పూజ పటిష్టమవుతుంది. ఆ కారణంగా ధ్యానం బలపడుతుంది. కనుక స్తోత్ర పఠనతో దైవం సంప్రీతుడవడమంటే ఏమిటో సరిగ అర్థం చేసుకోవాలి.

ఇక హారతి. ఆరతి సంగతి ఒక్క మాట చెప్పాలి. ఉత్తమ గుణ సంపన్నులైన వారికి దృష్టిదోషం తగులుతుందన్నది అనుభవం. దృష్టిదోషమంటే చూచేవారి మనస్సులోని కలుషిత సంస్కార ప్రభావం వారి దృష్టితో చేరి ఇతర వస్తు, వ్యక్తి, ప్రాణుల మీదకు సోకుతుంది. ఇది మన స్థూలదృష్టికి ప్రత్యక్షగోచరంకాదు. దాని ప్రభావం గోచరమవుతుంది. అట్టి దోషం సోకిన మనిషి నిర్హేతుకంగా మత్తుగా అలసటచెందినట్లు బలహీనంగా కనిపించి ఒళ్ళునొప్పి, ఒళ్ళు విరుచుకోడం, అమితంగా ఆవులించడం, ముఖం కాంతిహీనం కావడం, అస్వస్థులు కావడం జరుగుతుంది. అప్పుడు ఆ దోషాన్ని హరించడానికి వుత్తమపద్ధతి హారతి. అందుకే వివాహాదులలో వధూవరులకు కూడా హారతిస్తారు. ఇలా దోషమెలా సోకుతుందో ఒక్క వుదాహరణ: బెంగాలులోని శ్రీ బాలకృష్ణస్వామి అని పేరుగల యోగి యొకరుండేవారు. ఆయన భక్తుడు ఒకనాడు నాణ్యమైన ఒకరకమైన పండును ఆ యోగికర్పించాడు. ఆ సమయంలో అక్కడున్న మరొక భక్తుని మనస్సులో దాన్ని తినాలనే కోరిక కల్గుతుంది. తక్షణమే ఆ పండు నా యోగి ఆ భక్తునికే యిచ్చారు. అందరిలో తనకే ఎలా ఇచ్చారో అని అతడాశ్చర్యాన్ని వెలిబుచ్చితే ఆయనన్నారట- ఏ వస్తువుకేనైనా అట్టి ఆశతో ఏవరైనా చూస్తే దానిమీద అతీంద్రియావగాహనకు గోచరమయ్యే రీతిన దానినలా కోరికతో చూచిన వారి రూపముతోపాటు, అతడి మానసిక సంస్కారాలు కూడ సోకుతాయని, ఎంతో శ్రమతో అటువంటి చపల సంస్కారాలను క్షాళన చేసుకున్న యోగుల కట్టి వస్తువులను సేవించడం వల్ల అట్టి మలిన సంస్కారాలు సోకి సాధనకంతరాయమవుతాయి. గనుక వారు వీటిని సేవించరని చెబుతారు. రామకృష్ణపరమహంస కూడా ఇలానే చెప్పేవారు. అట్టి దోషాలను తొలగించగలదు కర్పూరహారతి. అది దాని కొరకేర్పడినదని తలచవచ్చు- అలా తన ఇష్టమూర్తికి ఎట్టి సూక్ష్మమాలిన్యం సోకకుండా చూచుకోవడంలోని ప్రేమలాగ. కాకుంటే మానవులమీద చూపితే దానినే ప్రేమంటాము. దైవం పట్ల, గురువుల పట్ల అయితే భక్తి అంటాము. 'పరమ ప్రేమరూపా' అంటే భక్తి పరమ ప్రేమస్వరూపమని భక్తి సూత్రం. మానవ ప్రేమలు అసంపూర్తిగా వుంటాయి. ఒక్కొక్కరి మీద కొంత కొంత. దైవం మీదదిపూర్ణమై దైవానికి ప్రేమలో సాటిని కల్పించనిదై వుంటుంది. అందుకని పరమ ప్రేమరూపం భక్తి. ఇది పూజ, ధ్యానం, సత్సాంగత్యం, వివేకము, ధర్మాచరణవల్ల, సద్గురు సేవవల్ల క్రమంగా పక్వావస్థకు వస్తుంది. ఆ ప్రేమ చరమరూపమే ధ్యానసమాధి. అదే బ్రహ్మ సాక్షాత్కారం. అది సర్వకాల సర్వావస్థలయందు నిలిస్తే ముక్తి, జ్ఞానం, కైవల్యం.

**దృష్టిదోషమంటే చూచేవారి మనస్సులోని కలుషిత సంస్కార ప్రభావం వారి దృష్టితో చేరి ఇతర వస్తు, వ్యక్తి, ప్రాణుల మీదకు సోకుతుంది. ఇది మన స్థూలదృష్టికి ప్రత్యక్షగోచరంకాదు. దాని ప్రభావం గోచరమవుతుంది. అట్టి దోషం సోకిన మనిషి నిర్హేతుకంగా మత్తుగా అలసటచెందినట్లు బలహీనంగా కనిపించి ఒళ్ళునొప్పి, ఒళ్ళు విరుచుకోడం, అమితంగా ఆవులించడం, ముఖం కాంతిహీనం కావడం, అస్వస్థులు కావడం జరుగుతుంది. అప్పుడు ఆ దోషాన్ని హరించడానికి వుత్తమపద్ధతి హారతి.**

అందుకే పూజ విధించబడింది భక్తులకు.

ఇక బాబా పూజలోని విశిష్టత. బాబా పటానికి తార్కాడ్ అనే భక్తుడు బాంద్రాలో నివేదన సమర్పించడం మరచినప్పుడు శిరిడీలో సాయి ఆ సమయంలోనే ఆ విషయాన్నే తన ఎదుటనున్న శ్రీమతి తార్కాడ్, తార్కాడ్ కుమారులతో చెప్పారు. ఇంకొక భక్తుడు బొంబాయిలో సాయి పటానికి నమస్కరించిన కొన్ని సంవత్సరాలకు ప్రథమంగా దర్శించగానే, "నాకితడు యిన్ని సంవత్సరాలుగా తెలుసునని" బాబా అదే సత్యాన్ని వెల్లడిచేశారు కనుక సాయికీ-పటానికీ భేదంలేదని గుర్తించి సదా సాయిని పూజించి సాటిలేని ఆయన కృపను మనమందరం చవిచూతముగాక!

ఈ పూజా విధానంలో(ఆచార్యులు రచించిన "శ్రీ సాయినాథ పూజ") పొందుపరచబడిన నామావళి గురించి కొద్ది మాటలు చెప్పాలి. అది 9-4-75న సాయంత్రం. ధ్యానానికి కూర్చొనగా చాలాగాఢంగాను, చాలా సేపు ధ్యానం కొనసాగింది. చివరిలో ధ్యానాన్ని విరమించబోయేప్పుడు మనస్సు తిరిగి సాయి రూపము, లీలలు మీదకు వచ్చింది. ఆ స్థితిలో వర్ణనాతీతమైన పారవశ్యంతో సాయి గుణాలను మనస్సు స్మరించనారంభించి ఈ నామాలు మనస్సులో దొర్లనారంభించాయి. ఒక్కొక్కనామం మనస్సులో మెదుల్తుంటే మనస్సు మరలా తీవ్రంగా ధ్యానోన్ముఖమౌతుంది. ధ్యానానికంత తీవ్రంగా ఉన్ముఖం చేసే

**ధ్యానానికి కూర్చొనగా చాలాగాఢంగాను, చాలా సేపు ధ్యానం కొనసాగింది. చివరిలో ధ్యానాన్ని విరమించబోయేప్పుడు మనస్సు తిరిగి సాయి రూపము, లీలలు మీదకు వచ్చింది. ఆ స్థితిలో వర్ణనాతీతమైన పారవశ్యంతో సాయి గుణాలను మనస్సు స్మరించనారంభించి ఈ నామాలు మనస్సులో దొర్లనారంభించాయి. ఒక్కొక్కనామం మనస్సులో మెదుల్తుంటే మనస్సు మరలా తీవ్రంగా ధ్యానోన్ముఖమౌతుంది. ధ్యానానికంత తీవ్రంగా ఉన్ముఖం చేసే నామావళిని వ్రాసుకుంటే పూజకుపకరిస్తాయని తోచి చాలా వేగంతో వ్రాయడం జరిగినది.**

నామావళిని వ్రాసుకుంటే పూజకుపకరిస్తాయని తోచి చాలా వేగంతో వ్రాయడం జరిగినది. మధ్యలో ఒక్కొక్కనామం వ్రాసేటంత విరామంకూడ లేక వదిలి వ్రాసుకుంటూ రావలసి వచ్చింది. వచ్చినవన్నీ వ్రాశాక జ్ఞాపకం చేసుకొనగా కొన్ని గుర్తుకొచ్చి వాటిని ఆ స్థానంలో చేర్చడం జరిగింది.

అయితే నామావళిని తిరిగి నేను చూచు కొన్నప్పుడు కొన్ని కేవలం అంతా బాబాయే(లేక దైవమే) అన్న అర్థం రావడం కోసం అతి అల్పమైన విషయాలు దొర్లి హాస్యాస్పదంగా ఉన్నవేమోనన్పించింది. కాని పారవశ్యంతో వచ్చాయి గనుక అట్లానే వుంచాను. తర్వాత ఇతర గ్రంథాలు చదివేప్పుడు ఆ నామాలు నేను తలచినట్లు అల్పాలు కావని శృతులవంటి వాటిల్లో చెప్పబడ్డవే అలా వచ్చాయనీ తెలిసి తప్పక నామావళి ప్రేరితమనితోచి, వాటిని వుంచడం జరిగింది.

తిరిగి ఆలోచించగా 'విశ్వరూపాయనమః' అనీ, 'సర్వస్మైనమః' అన్న నామాలలో 'వృక్షనాధాయ', 'ఓషదీనాధాయ', 'జలాశయస్వరూపాయ', 'సస్యాయ', 'ఆహారాయ', 'గుహాయ' మొదలైనవి యిమిడియన్నాయిగదా, ఇక యివి వేరే చెప్పనవసరమేమిటి? అన్న ప్రశ్నకు సమాధానం స్ఫురించింది. 'సర్వస్మై', 'విశ్వరూపాయ' అన్న నామాలను స్మరించే సమయంలో మన మనస్సు నిత్య జీవితంలో మాంద్యాన్ని చెందియుండడం చేత, చాలా స్వల్పసంఖ్యలోని వస్తువులే మనస్సున మెదుల్తాయి. కాని తక్కిన వస్తువుల స్మృతులు మరుపుచాటున హృదయంలో దాగియుండి, వాటి స్మరణ విశ్వశక్తిలో సమన్వయపడి జరుగునందువల్ల వాటి పట్ల మనకుండే లౌకికమూ, పామరమూ అయిన భావాలు అలానే వుండిపోతాయి. కనుక వాటిని కూడా ప్రత్యేకించి ప్రస్తావించి, అవీ దైవశక్తి స్వరూపాలని భావించి వాటిపట్ల దైవీభావాన్ని వహించనుపకరిస్తాయి. మనకు గోచరించే సర్వవస్తువులపట్ల ఆ భావం నిండడమే 'యోమాం పశ్యతి సర్వత్ర' అన్న గీత శ్లోకార్థం.

**శ్రీ సాయి తన భక్తులు తనను భక్తి శ్రద్ధలతో స్మరించిన క్షణంలో వారి చెంతనే వుంటానని వాగ్దానం చేసారు. అది నిజం. కారణం వారు సర్వవ్యాపియై, సర్వరూపాలలోనూ సర్వదా వున్నారని వారి లీలలు నిరూపిస్తున్నాయి. ఈ విషయం వారి సమాధి అనంతరంగూడా యదార్థమని నిరూపించే లీలలు అసంఖ్యాకంగా వున్నాయి.**

ఇంకో విషయం. నామాలక్రమం చాలా ఉపయోగకరమైన విధంగా వచ్చింది. కొన్ని నామాలు ఆరోహణ క్రమంగా వుంటే తర్వాత కొన్ని అవరోహణ క్రమంగా వచ్చాయి. అందుకే ఆరోహణలోని ప్రతి నామానికి విరుద్ధ గుణాన్ని సూచించేదిగా వుంటుంది - అవరోహణలోని మొదటి నామం. 'త్రికాలజ్ఞాయ నమః' తర్వాత 'కాలరహితాయ' అని వస్తుంది. 'భేదాయ' తర్వాత 'భేదాభేదవివర్జితాయ' అన్నది వస్తుంది. అలానే 'విశ్వరూపాయ', 'మహారూపాయ' తర్వాత 'విరూపాయ', 'నిశ్చలాయ', 'చంచలాయ' వస్తుంది. అంటే విరుద్ధ ధర్మాలుగా

Continued on page 14

# మానవత్వమా?..... దైవత్వమా?

దివ్యజనని అలివేలు మంగమ్మ

'మానవ శ్రేయస్సుకు మానవత్వం గొప్పదా? దైవత్వం గొప్పదా?' అనే ప్రశ్న ఎప్పుడూ వుంటూనే వుంటుంది. కొంతమంది మానవత్వమే గొప్పదంటే, కొంతమంది దైవత్వమే గొప్పదని వాదించుకుంటుంటారు. ఇంతకూ ఏది గొప్పది? అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వారికుండడం సహజమే. కానీ అసలు మానవత్వమంటే ఏమిటి? దైవత్వమంటే ఏమిటి? అనే విషయం గూర్చి పూజ్యశ్రీ మస్టరుగారు ఏమి చెప్పారు?

పరిపూర్ణ మానవత్వమే దైవత్వమని పూజ్యశ్రీ మాస్టరుగారు చేప్పేవారు. పరిపూర్ణ మానవత్వమంటే?..... మనిషి మనిషిగా బ్రతకడం. అదేం మాట? మనిషి మనిషిగా బ్రతుకక జంతువుగా బ్రతుకుతున్నాడా ఏమిటి? అసలు జంతువుగా ఎలా బ్రతుకుతాడు? అనే సందేహం కొందరికి రావచ్చు. కానీ ఈనాడు చాలామంది మనుషులు మనుషులుగా బ్రతకడం లేదనడంలో సందేహం లేదు. కారణం 'మనుష్య రూపేణ మృగా: చరంతి" అని భర్తృహరి చెప్పివున్నాడు. అంటే రూపం మనిషిదే కావచ్చు గాని గుణాలు జంతువులవే అని అర్థం. కానీ ఆలోచిస్తే ఇప్పటి కొందరు మనుషులకంటే జంతువులే మేలేమోనని అనిపించక తప్పదు. ఉదాహరణకు కుక్కకు వున్న విశ్వాసం కొంతమంది మనుషులకు వుండదు. అలాగే మరికొన్ని జంతువులకున్న సద్గుణాలు కొంతమంది మనుషులలో లేకపోవచ్చు. అలాగే కొన్ని జంతువులకున్న దుర్గుణాలు కొందరిలో కనిపిస్తాయి. అందుకే మన పెద్దవాళ్ళంటుంటారు, "వీడికి మేలు చేయడం పాముకు పాలు పోసినట్లయింది" అని అంటే "పాము తనకు ఆహారం పెట్టినవాడినే కాటేసినట్లు మనుషులు మేలుచేసినవారికే కీడు తలపెడతారు" అని. ఇలాగే ఎన్నో జంతువుల లక్షణాలు కొంతమంది మనుషులలో కనిపిస్తుంటాయి. అంటే మనిషి రూపంలో మృగాలు సంచరిస్తున్నట్లే కద.

అలాగే 'తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టేవాడు' అని, 'ఏరు దాటగానే తప్పను తగలేసిన వాడనీ, చెప్పుతినెడి కుక్క, పులితోలు కప్పుకున్న నక్క అనీ, కోతిబుద్ధి అనీ, కుక్కబుద్ధీ అనీ – ఇలా ఎన్నో రకాలుగా మనుషులు చెడుతనం గూర్చి చెప్పుకుంటుంటారు.

అలాగే మనుషుల మంచితనం గూర్చిగూడ చెబుతుంటారు. కుక్కలాగా విశ్వాసంతో పడివుంటాడు అనీ, గాడిదలాగా చాకిరీ చేస్తాడనీ, కాకిలాగా గోల చేస్తాడనీ, కోయిలలాగా మధురస్వరం కలవాడనీ, గార్ధభస్వరం అనీ, చెవిగోసిన మేకలాగా అరుస్తుంటాడనీ, జిత్తులమారి నక్క అనీ, అజగరం లాగా ఊరికే పడివుంటాడనీ, నోరులేని జంతువులాగా అనీ – యిలా ఎన్నో ఉపమానాలు. అంటే మానవునికీ, జంతువులకూ గుణాలలో అవినాభావ సంబంధమున్న దన్న మాట. అంతేకాదు. మానవులలో రాక్షసులు గూడా వుంటారనీ నరరూప రాక్షసులనీ బకాసురడనీ, కుంభకర్ణుడనీ, కీచకుడనీ ఇలా రాక్షసులతో గూడ పోల్చారు. అయితే ఇంతకూ మానవత్వలక్షణాలేమిటి?

గొడ్డులాగా చాకిరీ చేయడమా? కుక్కలాగా విశ్వాసంతో పడివుండడమా? నోరులేని జంతువులాగా వుండడమా? ఏమిటి? అంటే – మాస్టరుగారు ఒక సందర్భంలో మానవత్వానికి నిర్వచనం ఇలా చెప్పారు :'పరిపూర్ణ మానవుడు రాముడిలాగా వుంటాడు' అని. అంటే రాముడిలాగా వుండడమంటే ఏమిటి? శ్రీ రాముని లక్షణాలేమిటి?

శ్రీరామునిలోని సుగుణాలు ఎన్నో! అంటే ఆయనే సుగుణాలరాశి. ఆయన అపార కరుణామయుడు. తల్లిదండ్రుల పట్ల, భార్యా బిడ్డలపట్ల, సేవకులపట్ల, ప్రజలపట్ల, సకలజీవరాశిపట్ల ఆయన ఎంతో ప్రేమగా వుండేవాడు. శ్రీరాముడు ధర్మస్వరూపుడు. ఆయన సకల ధర్మాలను చక్కగా ఆచరించి చూపాడు. శత్రువుల పట్ల ఆయన క్షమాగుణము, తనకు మేలు చేసినవారి పట్ల కృతజ్ఞత, సేవ చేసేవారిపై కరుణ, శరణుపొందినవారిపై క్షమ, పెద్దలు, ఋషుల పట్ల వినమ్రత, కష్టాలలో సహనము, ఎటువంటి పరిస్థితులలోనూ మొక్కవోని ధర్మనిరతి, యాచకులు, ఆశ్రితుల పట్ల దానగుణము, విపత్కర పరిస్థితులలో అపార ధైర్య సాహసాలు – ఇన్నీ ఆయనలో పరిపూర్ణంగా వున్నాయి.

అందుకే ఆయన పరిపూర్ణమానవుడు. దయ, క్షమ, సహనము, ఔదార్యము, ధైర్యము, సాహసము, ఓదార్పు, కృతజ్ఞత, ధర్మనిరతి, అధర్మంపట్ల కఠినత్వము, సకల జీవులపట్ల ప్రేమ, సహాయము చేయడము – ఏవి మానవత్వ లక్షణాలని చెబుతారో ఇవన్నీ పరిపూర్ణంగా శ్రీరామునిలో వున్నాయి గనుక ఆయన దేవుడు, అవతారపురుషుడు. అంటే పరిపూర్ణ మానవత్వమే దైవత్వమన్నమాట. ఈనాడు ఇలాంటి మానవులు తక్కువమందే వున్నారని చెప్పవచ్చు. ఈనాడు మానవులలో ఈ దానవత్వ, పశుత్వ లక్షణాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మోసాలు, కుట్రలు, కుతంత్రాలు, హత్యలు, దోపిడీలు, దొంగతనాలు ఎక్కువైనాయి. ఒకరిని మించి ఒకరు తమ తెలివితేటలతో మోసం చేయాలనే ప్రయత్నిస్తున్నారు. లౌకిక సుఖాలవేటలో జరిగే యీ అన్యాయాలకు అంతులేకుండా వున్నది.

వాటిని చూస్తుంటే, వింటుంటే ఇన్ని రకాలుగా గూడ దుశ్చర్యలు చేయవచ్చా! అని ఆశ్చర్యం కలుగక మానదు. దీనినే దానవత్వమనీ, పశుత్వమనీ అంటారు.

అంటే ఈ ప్రపంచంలో మానవులే లేరా? మానవజాతి నశించిందా? అని కొందరికి అనిపించవచ్చు. పూర్తిగా అలా అనుకోవడానికి వీలులేదు. చాలావరకూ ఈ మానవత్వమున్న వాళ్ళు అక్కడక్కడా మనకు తారసపడుతూనే వున్నారు. వారినే రామునివలే ధార్మాత్ములనీ, లక్ష్మణునివలె సోదరుడనీ, ఆంజనేయునివలె నమ్మిన బంటనీ-యిలా అంటూ వుంటారు. అయితే పరిపూర్ణ మానవత్వం గలవారుగూడ ఈ లోకంలో అవతరిస్తూనే వున్నారు. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క రకంగా మానవులలోని రాక్షసత్వాన్నీ, పశుత్వాన్నీ తొలగించేందుకు, వారిని ధర్మనిరతివైపు నడిపించేందుకు ప్రయత్నిస్తూ వున్నారు. వారినే, అటువంటి మానవులనే మనం అవతారపురుషులనీ, మహాత్ములనీ, అవధూతలనీ, బాబాలు, స్వాములు అనీ పిలుస్తూ దైవస్వరూపులుగా ఆరాధిస్తూ వుంటాము. అంటే మనలో ఎటువంటి గుణాలు వున్నప్పటికీ వారిలోని సద్గుణాలంటే మనకు ఎంతో యిష్టమన్నమట. అందుకనే ఏదో ఒక కారణంగా వారి చుట్టూ తిరుగుతూ వుంటాము.

అట్టి పరిపూర్ణ మానవత్వంతో, సద్గుణ సంపత్తితో మనమధ్య అవతరించినవారు పూజ్యశ్రీ మాస్టరుగారు. మానవదేహధారియై మన మధ్య సంచరిస్తూ, దైవీ సంపదతో విలసిల్లుతూ, పరిపూర్ణ మానవత్వాన్ని తెలియ జేయడానికై గృహస్థాశ్రమంలో వుంటూ, సామాన్య మానవునిలా ప్రవర్తిస్తూ నేటి సమాజంలో గూడ మానవతతో ఎలా వుండవచ్చో తెలియజెప్పడానికి అవతరించారాయన.

ఆయన సన్నిహితులకు, స్నేహితులకు, అనుయాయులకు ఆయనలోని సద్గుణాల సంగతి తెలుసు. లోకంలో ఎందరో ఆధ్యాత్మికంగా ఉన్నతి పొందినవారు వున్నారు. కానీ వారు కేవలం ఆధ్యాత్మికతకే ప్రాధాన్యతనిస్తూ, నిజమైన ఆధ్యాత్మిక జీవితమే జీవితమనీ, లౌకిక విషయాల పట్ల నిర్లిప్తులై వుండాలనీ సాధ్యమైతే దానిని త్యజించాలనీ గూడ బోధిస్తూ వుంటారు. కొందరు కేవలం దేనికోసమైనా సరే భగవంతుని ఆరాధిస్తే చాలుననీ చెప్పి మిగతా విషయాలలో ఎలా ప్రవర్తించాలో తెలియజెప్పారు. అందుకని ఆధ్యాత్మికత అంటే కేవలం కోరికలు తీర్చుకోవడానికి మాత్రమే ఉపయోగపడే సాధనమన్నట్లు ప్రజలలో ఎక్కువమంది భావిస్తున్నారు. అందుకని ఎందరు ఆధ్యాత్మిక వేత్తలను సేవించి ఆరాధించినా వారి సమస్యలు తీరడమేగానీ మనశ్శాంతి లభించడం లేదు. మిగతా విషయాలలో అంటే అహంకార, మమకార, అసూయా, ద్వేషాది విషయాలలో ఎక్కడవేసిన గొంగళి అక్కడే వున్నట్లున్నది నేటి భక్తులలో చాలామంది పరిస్థితి. మరి దీనికి పరిష్కారమేమిటి? అసలు ఇది నిజమైన అధ్యాత్మికతా? లేక అసలైన మానవత్వమా? మానవత్వం లేని ఆధ్యాత్మికత వుంటుందా? ఆధ్యాత్మికతగాని మానవత్వం సరియైనదా?

ఈ ప్రశ్నలకు సమాధానంగా పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెప్పారు: "పరిపూర్ణ మానవత్వమే ఆధ్యాత్మికత. ఆధ్యాత్మికత వేరనీ, లౌకికత వేరనీ అనుకుంటారు. కానీ యీ రెండూ వేరు గాదు. ఇటు ధర్మం ప్రకారం ఖచ్చితంగా జీవిస్తే, అదే ఆధ్యాత్మికతకు దారి తీస్తుంది. అటు ఆధ్యాత్మికతతో జీవిస్తే ధర్మం ఆచరించక తప్పదు. ఉదాహరణకు ఒకడు లౌకిక జీవితాన్ని పరిత్యజించి ఆధ్యాత్మికత కోసమే సన్యసించినప్పటికీ అతడు సన్యాసధర్మాన్ని సక్రమంగా ఆచరిస్తేగానీ అతడు కోరిన ఆధ్యాత్మికత లభించదు. కాబట్టి ఈ రెండింటినీ సక్రమంగా ఆచరిస్తూనే వీటికతీతమైన దానిని పొందవచ్చు. ఈ రెండింటిలో ఏది లోపించినా కుంటినడక తప్పదు. వాడు పరిపూర్ణ మానవుడు ఏనాటికీ కాలేడు".

పూజ్యశ్రీ మాస్టరుగారు జనన మరణాల తత్త్వం గురించి, సృష్టి తత్త్వం గురించి, ఆధ్యాత్మిక తత్త్వం గురించి తీవ్రంగా ఆలోచించి తెలుసుకున్నారు. శ్రీ శిరిడీ సాయినాధుని అనుగ్రహంతో ఆయన ఆధ్యాత్మికానుభూతి పొందారు. అయినప్పటికీ ఆయన లౌకిక విషయాల పట్ల బాధ్యతను విస్మరించలేదు. మామూలు వ్యక్తులకంటే ఎంతో బాగా లౌకిక వ్యవహారాలను నిర్వర్తించేవారు. చిన్నప్పటినుంచి ఆయన ధైర్యసాహసాలకు పెట్టినపేరు. ఎక్కడ ఎవరు అన్యాయంగా ప్రవర్తించినా సహించక వారితో న్యాయపోరాటం జరిపేవారు. తమవారిపట్ల, బంధువులపట్ల మాత్రమేగాక ఆయన అందరిపట్ల ఎంతో ప్రేమగా వుండేవారు. ఎవరికి ఎటువంటి సహాయం కావలసి వచ్చినా తమ శాయశక్తులా సహాయం చేసేవారు. తనవలన సహాయం పొంది తరువాత తమను ద్వేషించిన వారిని గూడ ఆయన నిందించక తండ్రివలె వారు బాగుపడాలని పాటు పడేవారు. చివరకు తమతో ఎంతో దుష్టంగా ప్రవర్తించినవారిపట్ల గూడ 'వారేమి చేస్తున్నారో వారికి తెలియదు. తండ్రీ వారిని క్షమించు' అన్న ఏసుక్రీస్తు వలె వారి పట్ల జాలిపడేవారు. తమ తప్పు తెలుసుకుని తిరిగి ఆశ్రయించినవారిని ఆయన క్షమించేవారు.

ఇక సమాజం బాగుపడాలని ఆయన శతవిధాలా ప్రయత్నించారు. లౌకిక కోరికలతో వచ్చేవారికి బాబాను ఆశ్రయిస్తే వారి కోరికలు తీరుతాయని పారాయణలు చెప్పడమే గాక, శాంతి సౌఖ్యాలతో వుండడానికి అది మాత్రమే చాలదనీ, మనలోని దుర్గుణాలను పోగొట్టుకోవాలనీ ఆయన బోధించేవారు. వాటిని పోగొట్టుకోవడానికి వివేకంతో ఆలోచించడం ముఖ్యమని చెప్పి,

ప్రతివిషయంలోను ఎలా ఆలోచించి ఆయా గుణాలను పోగొట్టుకోవచ్చో ఆయన వివరించి చెప్పేవారు. సామాన్యంగా ఇతరులెవరూ చెప్పని ఈ విషయం గూర్చి ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. కారణం రాగద్వేషాదులను, అహంకార మమకారాలను పోగొట్టుకోనిదే ఇటు సామాజిక జీవనం గానీ, అటు ఆధ్యాత్మిక జీవనం గానీ సక్రమంగా వుండడం సాధ్యంగాదని ఆయన నొక్కి వక్కాణించారు. నేడు ఈ స్వార్థ మమకారాదులు, అసూయాదుల వలననే సమాజం ఎంతగా అశాంతికి గురి అవుతున్నదో మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఇక వీటిని పోగొట్టుకోకుండా ఆధ్యాత్మికతలో ఎంతగా అభివృద్ధి సాధించినప్పటికీ అది అభివృద్ధి ఏ విధంగానూ కాజాలదనీ, దానివలన రావణాది రాక్షసులవలెనే తమ శక్తులతో, ఆధ్యాత్మికత పేరుతో సమాజాన్ని ఇంకా అశాంతికి గురి చేయడమే అవుతుందనీ, అందువలన సమాజ పతనం తప్పదనీ ఆయన చెప్పేవారు.

సామాజిక పరంగా గూడ సమాజం బాగుపడడానికి అనేక సూచనలు అందించారు. విద్యావ్యవస్థను మార్చాలని, ఉపాధి వ్యవస్థనుమార్చాలని, దూరదర్శన్, పత్రికలు, సినిమాలు ఇప్పుడున్న వైఖరిని మార్చుకోవాలనీ, అవినీతికి అవకాశమివ్వకూడదనీ, ధర్మప్రబోధం చేయాలనీ చెప్పేవారు. కారణం అవి అన్నింటికంటే శక్తివంతమైన ప్రచార సాధనాలు గనుక వాటిని సరియైన విధంగా ఉపయోగించుకుంటే సమాజం బాగుపడడానికి ఎంతో అవకాశముంటుందనీ చెప్పేవారు. ప్రతివారూ సాటివారిపట్ల మానవత్వంతో ప్రవర్తించాలని, అందుకు 'సాటివారు మనకేది చేయాలనుకుంటామో అది వారికి చేయాలనే సూత్రాన్ని పాటిస్తే అందరూ సుఖశాంతులతో వుండవచ్చునీ ఆయన చెప్పేవారు.

ఇవన్నీ వాచా బోధించడము మాత్రమే గాక ఆయన అన్నింటినీ ఉత్తమంగా ఆచరించి చూపారు. సకల జీవులపట్ల ప్రేమ, శాంతము, కరుణ, దయ, క్షమ. మిన్ను విరిగి మీద బడ్డా ముక్కవోని ధైర్యం, సాహసం, అకుంఠిత దీక్ష. విజ్ఞాన సంపద, భక్తి జ్ఞాన వైరాగ్యములు - ఇవన్నీ ఆయన సహజ గుణాలు. మానవత్వము, దైవత్వమూ మూర్తీభవించిన ఆయన పరిపూర్ణ మానవుడుగాక మరేమిటి? అందుకే ఆయన అవతారపురుషుడు.

ఈ ఫిబ్రవరి తొమ్మిది 2011న, ఆయన చెప్పిన వాటిని గుర్తుతెచ్చుకుని ఆచరిస్తూ పరిపూర్ణ మానవత్వాన్ని పొందడానికి ప్రయత్నం చేద్దాము.


జై సాయి మాస్టర్ !!

ప్రియ గురు బంధువులారా! జగద్గురు శ్రీ సాయిమాస్టర్ ఆశించిన ఆధ్యాత్మిక సేవలనందించడానికి, దివ్యజనని అలివేలుమంగమ్మ భరద్వాజుల ఆశీస్సులతో 'శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్' స్థాపించబడినది. సాయిమాస్టర్ భక్తులు, జిజ్ఞాసువులు–పుస్తకములు, ఫోటోలు మొదలగు వాటికొరకుగాని, విరాళములు మరియు Magazine Subscriptions మొదలగు అన్ని విషయములకు ఈ క్రింది అడ్రసును సంప్రదించగలరు. D.D.లు, M.O.లు కూడా ఈ క్రింది అడ్రసుకు పంపించగలరు.

**Sri Manga Bharadwaja Trust**,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone :040-20063300

**పూజ్య శ్రీ సాయిమాస్టర్ సేవాభిలాషులు యీ క్రింది చిరునామాలకు విరాళాలర్పించి తరించగలరు.**

**Magazine** మరియు **General Donations** ను **"Sri Manga Bharadwaja Trust"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

**Annadanam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Sai Master)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

**Ashramam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Peace Foundation)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల్వారా పంపగలరు

**Books order** ను **"Sri Manga Bharadwaja Trust (Publications)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు



# గరుడ పురాణంలో ఆధ్యాత్మ బోధ

-శ్రోత

శ్రీ మహావిష్ణు-గరుడ సంవాదం:-

విష్ణువు:- మంచి చెడ్డల విచక్షణ లేక, తప్పుదారులు తొక్కుతూ, కేవలం స్వార్థపూరితంగా ప్రవర్తించేవారు నరకానికి పోతారు. ఆహార నిద్రా మైథునాలు ప్రాణికోటికంతటికీ సమానమే. జ్ఞానము కలవాడు మానవుడు మాత్రమే. అందుకే జ్ఞానం లేనివాడు రెండు కాళ్ళ పశువు మాత్రమే. మూర్ఖులు మలమూత్ర విసర్జన, ఆకలిదప్పులు, మదనతాపము, నిద్రలతో రోజంతా వ్యర్థపరుచుకుంటారు. తమ శరీరమని, ధనమని, ఇల్లని, బంధువులని అజ్ఞానం వలన భ్రమించి, అట్టి అహంకారంతోనే జీవులెందరో పుడుతూ, మరణిస్తూ ఉంటారు. అందుకే (వివేకి) అట్టి "సంగము"(అంటే అజ్ఞాన జనితమైన మానసిక సంబంధం) విడువవలెను. సామాన్యులకు పూర్తిగా దానిని విడుచుట కష్టము కనుక గొప్పవారి సాంగత్యము చేయవలెను(గొప్పవారు అంటే సత్పురుషులని అర్థము). జీవితంలో కలిగే అనర్థాలకు సత్పురుషులు ఔషధము వంటివారు.

సత్సంగము, వివేకము - ఈ రెండూ దోషములేని కళ్ళవంటివి. అవి లేనివారు గుడ్డివారి క్రిందే లెఖ్ఖ. అట్టివారు తప్పుదారి పాలౌతారు. దంభికులు కులమని, మతమని చెప్పుకుని, అట్టి ఆచారాల నిజతత్వం తెలియక మూఢాచారాలలో చిక్కుకుని పరధర్మాన్ని తెలుసుకోలేరు. చాలామంది కర్మలలో, ఆచారాలలో చిక్కుకుని లోకాన్ని, తమనూ మోసం చెసుకుంటున్నారు. "మేము కర్మకాండను నిర్వహిస్తున్నాము" అంటూ, కేవలం నామమాత్రంగా మంత్రోచ్చారణ, హోమాలు మొ॥వి చేస్తూ చాలామంది చెడుతున్నారు. మూర్ఖులు 'నాది' అనే మాయకులోనై శరీరములను ఏకభుక్తమని, ఉపవాసమని శుష్కింపజేస్తూ మోక్షము పొందవచ్చునని భ్రమిస్తున్నారు.

శరీరాన్ని శుష్కింప చేసినంతమాత్రాన ముక్తి లభించదు. పుట్టను బాదినంత మాత్రాన లోనున్న పాము చావదు కదా! జడలు, లేడితోళ్ళూ ధరించి తమను తాము జ్ఞానులమని అనుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. సంసార సుఖాలను విడువకుండానే బ్రహ్మజ్ఞానులమని చెప్పుకునేవారు బ్రహ్మకు, కర్మకు రెండిటికీ చెడ్డవారౌతారు. కనుక అలాంటివారిని దూరంగా ఉంచాలి. బట్టలు లేవనే సిగ్గు లేకుండా అడవులలోనూ, ఇళ్ళలోను తిరిగే గాడిదలు మొదలైన జంతువులు విరాగులని అనలేము కదా! మట్టి, బూడిద పూసుకున్న మాత్రానే ముక్తి పొందినట్లయితే ఏప్పుడూ మట్టిలో పోర్లే కుక్క ముక్తి పొందినట్లేనా? గడ్డి, ఆకులు తింటూ అడవులలో తిరగటం మోక్షానికి గుర్తుయితే ఎలకలు, మృగాలు కూడా ముక్తులేనా? పుట్టింది మొదలు చచ్చేంతవరకు గంగలోనే నివశించే కప్పలు, చేపలు యోగులవుతాయా? కనుక అట్టివి లోకాన్ని మెప్పించటానికి వేసే వేషాలు మాత్రమే. కనుక ఓ గరుడుడా! తత్వజ్ఞానం తప్ప మోక్షానికి కారణము మరొకటి లేదు.

పశువులు శాస్త్రాలలో చిక్కుకున్నట్లు ఎందరో శాస్త్రాలలో (పాండిత్యంలో) చిక్కుకుని పరమార్థమును తెలుసుకోలేకున్నారు. వేదశాస్త్రాలనే కీకారణ్యంలో చిక్కుకుని కుతార్కికులు దారి తెలియక తికమక పడుతున్నారు. వేదశాస్త్రాలు చదువుకుని గూడా అందులో చెప్పబడిన పరతత్వమును ఎవడైతే తెలుసుకోలేకున్నాడో వాడు విడంబమునకు ఉదాహరణము. పరతత్వాన్నెరుగక రాత్రింబవళు ్ళ "జ్ఞానమిది, జ్ఞేయమిది" అని శాస్త్రాలను వల్లిస్తూ ఉంటే ఇక లాభమేమి? అట్టివాని ఆధ్యాత్మబోధ కాకికూత వలే నిష్ప్రయోజనము. వాక్యములందు, ఛందములందు, కావ్యాలంకారమందు ముగ్ధులై గ్రంధస్థుతులు చేయగలరుగానీ ఇంద్రియాతీతమైన పరతత్వమును అట్టివారు తెలుసుకోలేరు.

పరతత్వము ఒకలా ఉంటే జనులు మరోలా ప్రయాసపడుతున్నారు. శాస్త్రం ఒకవిధంగా ఉంటే ఈ పండితులు మరోవిధంగా అర్థాలు చెప్తున్నారు. అహంకారం వలన కొందరు ఉపదేశం పొందకనే బోధలు చేసి ప్రజలను సత్యము నుంచి ప్రక్కదారి పట్టిస్తున్నారు. చాలామంది శాస్త్రాలను పఠించవచ్చుగాక, బోధించవచ్చుగాక, కానీ కూర రుచిని గరిటే తెలుసుకోలేనట్లు పరతత్వమును వారు తెలుసుకోలేకున్నారు. వీరు వేదశాస్త్రములను చదువుతున్నారు గానీ వాటి భావం వీరికి బోధపడుట లేదు. తనలో ఉన్న తత్వజ్ఞానాన్ని తెలుసుకోలేక చాలామంది శాస్త్రాలలో వెదికి దారి తప్పుచున్నారు.(మేక చంకలోనే ఉండగా బావిలో వెదికిన కాపరి వలే).

సంసారమోహం నుంచి బయటపడడానికి కేవలం శబ్ద బోధ చాలదు. "దీపము" అని ఉచ్చరించినంతమాత్రాన చీకటి తొలగదు కదా! గ్రుడ్డివానికి అద్దమెంత ప్రయోజనమో, వివేకము లేనివానికి శాస్త్రం అంతే ప్రయోజనకారి. అందుకే వివేకికి మాత్రమే శాస్త్రము ప్రయోజనకారి. తెలుసుకోవలసిన విషయాలను తెలుసుకోవాలని ఉన్నా శాస్త్రాలను సంపూర్ణంగా అధ్యయనం చేయడానికి ఆయుర్దాయం చాలదు. శాస్త్రాలు అనంతాలు, కానీ ఆయుష్షు అల్పము. కనుక హంస పాలను మాత్రమే గ్రహించి నీటిని వదలినట్లు వివేకి శాస్త్రముల సారము గ్రహించవలెను. వేదశాస్త్రాలను చదివి తత్వాన్ని గ్రహించిన బుద్ధిమంతుడు ధ్యానార్ధి ఆయి సారము గ్రహించి టెంకను

విడిచినట్లు శాస్త్రాదులను విడుస్తాడు. అమృతంతో తృప్తిని సాధించినవాడికి అన్నము వలన ప్రయోజనమెలాలేదో, అలానే ఆత్మజ్ఞానం పొందినవాడికి శాస్త్రాలతో పని లేదు. కేవలం వేదాలనో, శాస్త్రాలనో చదివితే ముక్తి రాదు. కేవలం జ్ఞానము వలననే అది లభించును. వర్ణాశ్రమాలు, షడ్దర్శనాలు, సర్వకర్మలూ కూడా ముక్తికి కారణాలు కావు. జ్ఞానమే కారణము. మోక్షం గురుముఖత: ఉపదేశం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. కానీ కోటి గ్రంథాలు చదివినా అది రాదు.

జ్ఞానం శాస్త్రం వలన పుట్టినదని, వివేకము వలన కలిగినది అని రెండు రకాలు. శబ్దజ్ఞానం శాస్త్రానికి సంబంధించినది. పరబ్రహ్మము వివేకానికి సంబంధించినది. కొందరు అద్వైతానికి ఇష్టపడితే మరికొందరు ద్వైతాన్ని అవలంబిస్తారు. కానీ ద్వైతాద్వైతాలకతీతమైన తత్వమును తెలుసుకొనలేక కీచులాడుకొనుచున్నారు. "నాది", "కాదు" అని రెండు భావాలే బంధమోక్షాలకు కారణములు. "నాది" అంటే పాశబంధములలో చిక్కుతాడు. "కాదు" అంటే ముక్తి పొందుతాడు. సంసార బంధమును కలిగించినదే సత్కర్మ. మోక్షమునకు దారి చూపేదే విద్య. తక్కిన కర్మలన్నీ కష్టాలకు, విద్యలన్నీ నైపుణ్య ప్రదర్శనానికి మాత్రమే దారితీస్తాయి.

కర్మలెంతవరకూ ఫలాపేక్షభరితాలో, సంసారమెంతవరకూ ఉంటుందో, ఇంద్రియ చాపల్యం ఎంతవరకూ ఉంటుందో అంతవరకూ తత్వజ్ఞానమెలా ఉంటుంది? దేహాభిమానము, మమకారము, ప్రయత్నలోపము, చంచలమనస్సు ఇవి ఉన్నంతవరకు తత్వజ్ఞానం కలుగదు. గురువానుగ్రహం లేక (ఇవి తొలగవు కనుక) తత్వజ్ఞానం కలుగదు. తత్వజ్ఞానాన్ని బట్టిమాత్రమే తపస్సు, వ్రతములు, జపములు, హోమములు, పూజలు ఫలిస్తాయి. (అది లేని నాడు సరిగా ఫలించవు). వేదశాస్త్రాలు కూడా తత్వజ్ఞానము కోసమే. అందుకే ముముక్షువు సర్వప్రయత్నాలలోనూ, సర్వావస్థలలోనూ, సర్వకాలములలోనూ తత్వనిష్ఠలో నిలవాలి. ధర్మము, జ్ఞానము అనే పుష్పములు, స్వర్గము, మోక్షము అనే ఫలములు కలిగిన మోక్షవృక్షాన్ని త్రికరణశుద్ధిగా ఆశ్రయించాలి.

(అందుకు గురువు అనుగ్రహము, బోధ అవసరము) కనుక గురువు నుండి జ్ఞానమును గ్రహించాలి. దాని వలన మానవుడు సునాయాసముగా ముక్తి పొందుతాడు.

జై సాయిమాస్టర్!

## పూజ ఎందుకు? ఎలా చేయాలి?

Continued from page 9

గోచరించే వాటికాధారంగా వున్న ఒక్క సద్వస్తువు ఆ రెండుగా వ్యక్తమవుతుందని స్ఫురించడానికే అలాటి క్రమం ఏర్పడింది. అలానే 'సర్వస్మై' అన్నది సర్వానికాధారమైన ఏకత్వాన్ని లక్షిస్తే, 'సర్వరూపాయ' అన్నది, ఆ ఏకత్వం ఏ నానాత్వంగా వెల్లడి అవుతున్నదో ఆ నానాత్వాన్ని లక్షిస్తుంది.

7నుండి □3వరకు కల నామాలలో 'లింగాయ' అన్న పదం సమానం. సంస్కృతంలో లింగము అంటే రూపము, దేహము అన్న అర్థముంది. 'పార్థివలింగస్వరూపాయ' అనగా సృష్టిలోని పృధ్వీతత్త్వమయమైన పదార్థాలన్నీ తన దేహంగా, పార్థివరూపంగా కల్గిన–అని అర్థం. మన దేహాన్ని వుదాహరణగా చూస్తే బాగా అర్థమవుతుంది శరీరంలోని పృధ్వీతత్త్వంగల ధాతు సముదాయం పృధ్వీ నిర్మితమై వుండడమేగాక అవన్నీ ఒక దేహంగా కూర్పుకల్గియుంటాయి. ఎముకలు అస్థిపంజరంలా కూర్చబడి వుంటాయి. అలానే సృష్టి సర్వమూ విశ్వమూ దేని దేహమో దానికి సృష్టిలోని పార్థివ వస్తుజాలమంతా అలానే కూర్పు, ఏకత్వమూ కలిగియుంటాయన్న భావం యిందులో ప్రకటమవుతుంది.

తక్కిన నామాలకు అర్థం తెలియనివారు నేను వ్రాసిన 'ఏది నిజం?', 'మతం ఎందుకు?' అన్న చిన్న పుస్తకాలు, 'విజ్ఞాన వీచికలు' చదివితే బాగా వివరంగా అర్థమవుతాయి.

ఇలాంటి భావంతో నిండియున్న నామావళికంతకూ సాయిలీలలలో ప్రకటమయ్యే ఆధ్యాత్మ తత్వమే వివరణ. శ్రీ సాయి సమాధిని 1963 ఫిబ్రవరి 9న దర్శించినప్పుడు నాకైన అనుభూతి అంతటికీ ఈ నామావళి వివరణ అని తిరిగి చూచుకుంటే అర్థమవుతుంది. ఈ చరాచర జగత్తంతా ఏ మహా చైతన్యంలో భావనామాత్రంగా వున్నదో ఆ చైతన్యమే బాబా అను నా అనుభవాన్ని గుర్తుంచుకొంటే నామావళి నాకు బాగా అర్థమవుతుంది.



# శ్రీ సాయి సచ్చరిత్ర



మరాఠీ మూలం: శ్రీ హేమాద్పంతు
స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

జనవరి సంచిక తరువాయి

అధ్యాయం - 52

శ్రీ గణేశాయ నమః, శ్రీ సరస్వత్యై నమః, శ్రీ గురుభ్యోన్నమః,
శ్రీ కులదేవతాయై నమః శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః శ్రీ సద్గురు సాయినాథాయ నమః



ఈ అధ్యాయంలో గ్రంథం మొత్తాన్ని సింహావలోకనం చేసిన తర్వాత, అన్ని అధ్యాయాల సారాంశాన్ని అవతరణికలో నివేదించి ఈ గ్రంథాన్ని సంపూర్ణం చేస్తాను. (1) శ్రీ సాయిబాబా దేహధారులై వున్నప్పుడు అనేక సమయాలలో, అనేక సందర్భాలలో భక్తులకు ప్రసాదించిన అనుభవాలను గుర్తుంచుకోవడానికి ఈ గ్రంథాన్ని వ్రాశాను. శ్రీ సాయియే నా చేత వ్రాయించుకున్నారు(2). ఇహపర సుఖాలను ప్రసాదించే పరమ పవిత్రమైన ఈ సాయి సచ్చరిత్రను పఠించండి(3). ఈ సాయి సచ్చరిత్రలో ఎన్నో సాయిబాబా చేసిన లీలలు వున్నాయి. శాస్త్రజ్ఞానం గానీ, పాండిత్యం గానీ ఏ మాత్రం లేనటువంటి ఈ హేమాద్పంతు చేతిని పట్టుకుని సాయిబాబా తమ చరిత్రను స్వయంగా వ్రాయించుకున్నారు(4). కొందరు గురువులు తమ జీవితంలోని విషయాలను శిష్యులకు తెలియజేస్తారు. వారు దేహత్యాగం చేసిన తర్వాత వారి జీవిత చరిత్రను వ్రాయడానికి అవి ఎంతో ఉపకరిస్తాయి(5). శ్రీసాయిబాబా అనేకములైన నిగూఢ విషయాలను చెబుతూండేవారు. అప్పుడు అక్కడవున్న భక్తులు తన్మయులై ఆకలి దప్పులను మరచి ఆయన చెప్పే విషయాలను వింటుండేవారు(6). సాయి యొక్క దివ్యరూపాన్ని దర్శించినవారి త్రివిధ తాపాలూ నశించి పోయాయనడంలో ఎట్టి సందేహమూ లేదు. ఇక ఆయన శక్తి సామర్థ్యాలను గూర్చి వర్ణించడమెలా సాధ్యం? అందుకే తమ భక్తులనుద్ధరించడానికి సాయినాథుడే తమ చరిత్రను వ్రాయించుకున్నారు(7,8).

పవిత్ర గోదావరి నదిలో స్నానం చేసి, శ్రీసాయిబాబా యొక్క సమాధిని దర్శించి, శ్రీ సాయిచరిత్రను పారాయణ చేసినట్లయితే త్రివిధ తాపాలూ నశిస్తాయి(9). శ్రీసాయిబాబా యొక్క లీలలు గూర్చి మాట్లాడుకుంటున్నప్పటికీ మనకు తెలియకుండానే పరమార్థ ప్రాప్తి కలుగుతుంది. అందువలన ఈ గ్రంథాన్ని పారాయణ చేస్తుంటే కోటి కోటి పాపాలు నశించిపోతాయి(10). జనన మరణాల రాకపోకల నుండి విముక్తి పొందాలనుకునేవారు గురు చరణాలయందు అనురక్తిని, గురునామస్మరణ పట్ల భక్తినీ కలగి వుండాలి (11). మిథ్యాజ్ఞానం కారణంగా ఆత్మయొక్క స్వరూపం గురించి తెలియదు. అందువలన సర్వ అనర్థాలకు కారణమైన జనన మరణ చక్రం ఉత్పన్నమవుతుంది(12). అనాత్మ వస్తువుల యందు అభిమానము కలిగివుండడమే 'మృత్యువు' అని విద్వజ్ఞులు చెబుతారు(13). అందుకని శ్రీ సాయికథా సాగరాన్ని మథించాలి. మధురములు, నిత్యనూతనములూ అయిన సాయి లీలలను శ్రవణం చేసిన శ్రోతలకు అధఃపతనం తప్పుతుంది (14). సాయి యొక్క సగుణ సాకార రూపాన్ని ధ్యానం చేస్తుంటే వారి సగుణ రూపం లుప్తమై ఆయన యొక్క ఆత్మస్వరూపం ప్రకటమవుతుంది(15). ప్రథమంగా సాయిబాబా యొక్క సగుణసాకార రూపధ్యానం చేస్తుంటే ఆయన యొక్క నిర్గుణ నిరాకార తత్త్వం గురించి తెలుసుకొనడం సులభమవుతుంది(16).

శ్రీ సాయిబాబా తమ భక్తులను తమ పాదాల వద్దకు రప్పించుకుని వారికి తెలియకుండానే క్రమంగా శరీర భావన తొలగించి పారమార్థికత వైపుకు నడిపిస్తారు(17). సాగరాన్ని ఆలింగనం చేసుకున్న నది తన అస్తిత్వాన్ని కోల్పోయినట్లు బాబా తమను ఆశ్రయించిన భక్తులకు ద్వైతభావాన్ని నశింపజేస్తారు(18). రెండు దీపాలు ఒకదానినొకటి తాకిన తర్వాత ఒకటిగా అయిపోయి ఒకే దీపంగా వెలుగుతాయి(19). కర్పూరము తన సువాసనను, సూర్యుడు తన ప్రకాశాన్నీ, సువర్ణం తన కాంతినీ విడిచి వుండడం సాధ్యమా?(20). నది సాగరంలో కలసిపోగానే అది సాగరమైపోతుంది, అలాగే ఉప్పు, నీటిలో కలిసిన

వెంటనే కరిగిపోతుంది(21). అలానే సాయి చరణాలను ఆశ్రయించిన భక్తులకు ద్వైతభావం నశించిపోతుంది. వారి అహంభావం అంతరించి సాయిలో ఐక్యమవుతారు(22). జాగ్రత్, స్వప్న సుషుప్తులు మూడింటిలో దేనిలోనైనా సరే మనసు సాయిమయమైనట్లుయితే అంతకంటే సంసార బంధ పరిత్యాగమేముంటుంది?(23).

ఇప్పుడు నేను శ్రీసాయిబాబా పాదాలకు సాష్టాంగ ప్రణామం చేసి వేడుకుంటున్నాను,“ సాయీ! నా మనసు మీ మీద తప్ప మరొక విషయం వైపు వెళ్ళనీయకు ” అని(24). ఎవరైతే బ్రహ్మాదిస్తంభ పర్యంతము, ఘటాలలోను, మఠాలలోనూ సర్వత్రా, సర్వప్రాణులలోనూ పరిపూర్ణంగా ఆకాశం వలె ఎవరైతే నిండివున్నారో, ఎవరైతే అందరినీ సమానదృష్టితో చూస్తారో, ఎవరికైతే ప్రియాప్రియాలు, మానావమానాలు లేవో, ఎవరికైతే ఇసుమంతైనా భేదభావం వుండదో అట్టి సాయి సమర్థులను శరణు శరణువేడుకుందాము. స్మరించేవారి సకలకోరికలూ తీర్చే సాయి చరణాలపై శిరస్సు నుంచి కృతార్థులమవుదాము(25,26,27). సజ్జన శ్రేష్ఠులైన శ్రోతలారా! మీకందరికీ నాప్రణామములు. మిత్రులైన మీరు నా మనవి వినండి (28). ఇంతవరకూ మీరు అనేకములైన బాబా లీలలు విన్నారు. వాటిని క్షణం గూడా మర్చిపోకుండా మననం చేయండి(29) మీరు సాయి యొక్క దివ్య లీలలను శ్రద్ధగా విననట్లయితే శ్రీసాయి నా పట్ల ప్రసన్నులవుతారు(30). శ్రోతలకు శ్రద్ధ లేకపోతే వక్తకు తృప్తి వుండదు. పరస్పర సంతృప్తి లేనిదే చెప్పడము వినడమూ గూడ వ్యర్థమే(31). ఈ సంసార సాగరాన్ని దాటడం ఎంతో కష్టం. మోహపు కెరటాలు ఉప్పొంగి తీరాన వున్న ధైర్యమనే వృక్షాన్ని పెకలించి వేస్తాయి(32). అహంకారమనే పెనుగాలులు ఈ భవసాగరాన్ని అల్లకల్లోలం చేస్తాయి. క్రోధము, ద్వేషము అనే మొసళ్ళు ఈ సాగరంలో నిర్భయంగా సంచరిస్తుంటాయి(33). వాసనలు, వికల్పాలు అనే సుడిగుండాలు, నిందలు, తిరస్కారాలు, అసూయలనే అసంఖ్యాకములైన జలచరాలు యిందులో యథేచ్ఛగా ఈదుతూ వుంటాయి(34). ఇది యింతటి భయంకరమైన సాగరమైనప్పటికీ అగస్త్యుని వలె సద్గురువు దానిని ఔపోసన పట్టేస్తారు. వారి చరణాలకు దాసులైన వారికి కించిత్తు గూడ వాటి వలన భయముండదు(35). శ్రీసాయి ఈ భవసాగరాన్ని సులభంగా దాటించే నావ వంటివారు. వారి చరణాలను ఆశ్రయించినవారినందరినీ ఆయన తీరానికి చేరుస్తారు(36). దుస్తరమైన ఈ మహాభవసాగరాన్ని దాటడానికి సాయి చరణాలను నావగా చేసుకుంటే నిర్భయంగా ఆవలి తీరానికి చేర్చుతారు(37). శ్రద్ధ అనే వ్రతాన్ని ఆచరించినట్లయితే సంసారదు:ఖంలోని తీవ్రత తెలియదు. ఇంతకుమించిన లాభం మరొకటి ఏముంటుంది?(38). సాయి చరణాలపట్ల అత్యంత భక్తి కలిగివుండాలి. సాయిమూర్తిని నయనాలలో నిండుగా నింపుకోవాలి. సర్వ భూతములయందు సాయినే దర్శించాలి. ఇటువంటి స్థితి భక్తులకందరకూ కలుగుగాక!(39). ఎన్నో జన్మలను వ్యర్థం చేసుకున్నాము. ఇప్పుడైనా విషయసుఖాలను త్యజించి సద్గతి పొందడానికి ప్రయత్నం చేసే శక్తి కలుగుగాక!(40).“ శ్రీ సాయి సమర్థులు నిరంతరం మన వెన్నంటి వున్నారు. ఇక మనలను ఎవరూ ఏమీ చేయలేరు” అన్న దృఢ విశ్వాసం నిర్భయంగా వున్న భక్తులు ధన్యులు(41).

‘ఈ గ్రంథం అందరి గృహాలలో వుండాలి’ అని బాబాను ప్రార్థించాలని నాకనిపిస్తున్నది. కారణం ఈ గ్రంథాన్ని నిత్యమూ నియమంగా పఠించినట్లయితే ఎటువంటి సంకటాలూ సంభవించవు(42,43). శుచిర్భూతులై ఈ గ్రంథాన్ని భక్తి శ్రద్ధలతో సప్తాహ పారాయణ చేసేవారి అరిష్టాలు తొలగిపోతాయి(44). ఈ గ్రంథం ఆధ్యాత్మికమనే దారంతో అల్లబడింది. ఇందులో అనేక విషయాలు పొందుపరచబడి వున్నాయి. ఈ చరిత్రను నియమంగా పారాయణ చేసినా లేక శ్రవణం చేసినా గూడ శ్రీసాయి సమర్థులు వారి వారి కష్టాలను తొలగిస్తారు(45,46) ధనం కోరుకునే వారికి ధనం లభిస్తుంది. యశస్సు కోరుకునే వారికి యశస్సు లభిస్తుంది. వారి వారి యొక్క నిష్ఠ, సబూరీలననుసరించి ఫలితం లభిస్తుంది. శ్రద్ధా భక్తులు లేకపోతే ఎటువంటి అనుభవమూ కలుగదు(48). పూజ్యభావంతో ఈ గ్రంథాన్ని పఠించినట్లయితే సాయిబాబా ప్రసన్నులవుతారు. అజ్ఞాన దారిద్ర్యాన్ని నశింపజేసి జ్ఞాన సంపదను ప్రసాదిస్తారు(49). ఈ గ్రంథ రచనకు ప్రేరేపించినది సాయియే. వారి మనోభావరూపమే ఈ గ్రంథ రచన. ఆయన చరణాలపై ఎవరికి అనురక్తి వుంటుందో వారి జీవితం ధన్యం (50).

- సశేషం



# శ్రీ దత్తలీలామృతము

## (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర)



జనవరి సంచిక తరువాయి

- శ్రీమతి శ్రీదేవి



**మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో:**
**బంధస్య విషయా సంగి - ముక్తిర్నిర్విషయం మన:**

మనుష్యునకు బంధనమును, మోక్షాన్ని కూడా యిచ్చేది మనస్సే. ఆ మనస్సు విషయాలతో కూడితే మనుష్యుడు మాయా బద్ధుడౌతాడు. విషయాలను విడిచి ఆత్మభావనలో వుంటే మాయా విముక్తుడౌతాడు. ఎప్పుడు ధనముపైనే ఆసక్తి వుండే లోభి ఏ పని చేస్తున్నా అతని మనస్సు తాను కూడబెట్టిన ఆ ధనముపైనే వున్నట్లుగా, జ్ఞాని కూడా మనస్సును పరమాత్మయందే నిలిపి, బాహ్యకర్మములు నిర్వర్తిస్తూ కూడా బ్రహ్మానందమును అనుభవిస్తూ వుంటాడు. చూడు, నాయనా! మోక్షమనేది ఎక్కడో ఆకాశంలో లేదు, క్రిందపాతాళంలోనూ లేదు, మధ్య భూమిలోనూ లేదు, తనలోనే వుంది. తనలోని అహంకారము నశించటమే మోక్షము. 'అమ్మో! అహంకారాన్ని తొలగించుకొనటం సామాన్యమైన పనేనా?' అని భ్రమపడవలసిన పనిలేదు. అది ఏమంత కష్టమైన పని కాదు. పువ్వులు కోయటం ఎంత సులభమో, కన్నులు మూసి తెరవటం ఎంత సులభమో, అంత సులభం అని తెలుసుకో. అది ఎలాగంటావా? ఈ మనస్సేగా, తన చంచలస్వభావం వలన బాహ్యప్రపంచమునా రూపుదాల్చి, విషయములు పైకి పరిగెత్తుతూ మాయా మోహాలలో మునిగిపోతున్నది? 'నేను వేరు' అన్న భావనలో మునిగి ఏకత్వ భావనను మరచి జననమరణ చక్రములో పరిభ్రమిస్తున్నది యీ మనస్సేకదా! విజ్ఞుడవైన నీకు యివన్నీ నేను బోధించనవసరములేదు. నీవు అన్నీ తెలిసినవాడివి. అటువంటి నీకు చెప్పేదేమంటే, ప్రస్తుతం నువ్వు, నీకు జన్మనిచ్చిన నీ తండ్రికి ప్రియము, సంతోషము కలుగునట్లుగా కొంతకాలము మెలగి ఆ తర్వాత నీయిష్టప్రకారము నడచుకో. అప్పుడు ఎవరము నిన్ను అడ్డగించము, ఆటంకపరచము. జనసంఘములో వున్నంతవరకు విడ్డూరముగా ప్రవర్తించకూడదు. అయినా జనసంఘము వలన మాత్రము నీకు భయమెందుకు? "ద్వితియాద్వై భయం భవతి" ఆంతర్యంలో ఏకత్వ భావనను కలిగి వున్న నీకు భయమెక్కడిది? రెండవది-అన్యము - అనేది వున్నప్పుడే కదా, భయము వుండేది? అది లేని వాడికి భయముండే ఆవకాశమే లేదు. కాబట్టి జనసాంగత్యమునకు భయపడక నీతండ్రి యిష్టప్రకారము నడుచుకొని పితృఋణము తీర్చుకొనటం వలన నీకు అంతా శుభమే జరుగుతుంది." అంటూ ఎంతగానో నచ్చజెప్పి, ఒప్పించి, తన యింట్లోకి తీసుకొని వెళ్లి స్నానాదులు చేయించి మహా పతివ్రతా శిరోమణి అయిన సుశీల భోజనము వడ్డించగా తనప్రక్కనే ఆ బాలుని కూర్చుండ బెట్టుకొని భుజింపజేశాడు.

భోజనానంతరం వాళ్లిద్దరూ శ్రీదత్తస్వామి లీలల గూర్చి ముచ్చటించసాగారు. ఇంతలో ఆ పిల్లవాని తల్లిదండ్రులు రాగా వాళ్లను చూడగానే పిల్లవాడు లేచి ఎదురువెళ్లి వాళ్లకు నమస్కరించాడు. ఆ దృశ్యం చూసిన తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. వాళ్లు పట్టరాని ఆనందంతో విష్ణుదత్తుని పాదాలపై బడి "ఓ స్వామీ! మహాత్మా! మా ప్రాణాలు నిలబెట్టారు. మా ప్రాణానికి ప్రాణమైన యీ బిడ్డను ఉద్ధరించి, మమ్మల్ని, మా వంశాన్ని తరింపజేశారు. మా యిల్లు నిలబెట్టారు. పిల్లవాని తీరుతెన్నులు చూసి చావలేక, బ్రతుకలేక ప్రాణావశిష్టులమై వున్న మాలో జీవనాన్ని నింపారు. ఏ మంత్రములు, ఔషధాలు చేయలేనిది, కేవలం మీ సన్నిధి ప్రభావమే మా పిల్లవాడిని స్వస్థుడిని చేసింది. ఓ మహాత్మా! మీ ఋణము మేము ఎన్నటికీ తీర్చుకొనలేము. మీకివే మా శతకోటి నమస్కారాలు." అని విష్ణుదత్తుని స్తుతించి సెలవు తీసుకొని, సంతోషంతో కుమారుని

తీసుకొని తమ గృహానికి వెళ్లిపోయారు ఆ దంపతులు. ఆ బాలుడు తల్లిదండ్రులు జీవించి వున్నంతవరకు వారి యిష్టప్రకారమే నడుచుకొంటూ వారిని సంతోషపెట్టాడు. ఆ తర్వాత సకల బంధములను విడిచిపెట్టి గృహము వీడి అడవులకు వెళ్లి ఆత్మరతుడై జీవన్ముక్తుడుగా జీవితాన్ని గడిపాడు.

ఈ విధముగా ఏడవ గాధను కూడా చెప్పి బృహస్పతి యింద్రునితో యిలా అన్నాడు –" సురేంద్రా! ఈ విప్రకుమారుడు విజ్ఞానామృతసాగరుడు. అయినప్పటికీ, అతనికి కొంచెము సంగ భయము మిగిలి వుండటం వలన అతడు ప్రపంచంతో కలువక విద్దూరంగా ప్రవర్తిస్తూ తల్లిదండ్రులకు సమస్యాత్మకంగా మారాడు. మహా మహిమాన్వితుడు అయిన విష్ణుదత్త సోమయాజి బోధలచే ఆ బాలునిలో వున్న ఆ సంగ భయం తొలగిపోయింది."

"సురేంద్రా! ఈ లోకములోని మనుష్యులందరు తమలోనే వున్న పరమాత్మను, ప్రజ్ఞానఘనుని ఎల్లప్పుడు అనుభవించుచున్నను, ఆ ఆత్మానుభూతిని చవిచూచి ఆనందించలేక పోవటానికి కారణం మాయా మోహితులై తమ స్వస్వరూపాన్ని మరచిపోవటమే. భగవంతుని మాయ ఎంతటి వారినైనా చలింపజేస్తుంది కదా! 'నేనే కర్తను, నేనే దాతను, సుఖదు:ఖముల ననుభవించు భోక్తను నేనే' అన్న భావనలో మునిగి, లోనున్న కూటస్థుని, పరాత్పరుని లోకము తెలిసికోలేకపోతున్నది. అరెరే! ఎంతటి అజ్ఞానము! పుత్రుడు చంకలోనుండగా మరచిపోయి ఊరంతా వెతుకులాడే తల్లిలాగా యీ మనుష్యుడు 'నేనవరిని, నాకు ఆత్మజ్ఞానము ఎలా కలుగుతుంది?' అని అన్వేషిస్తూ వ్యర్థముగానెక్కడికో బయటకు పరుగెత్తుతున్నాడు కదా! అటువంటి జిజ్ఞాసువుల కర్మ పరిపాకము వలన విష్ణుదత్తు సోమయాజివంటి మహాత్ములు, సద్గురువులు వారికి తారసిల్లి జ్ఞానయోగ మార్గములను వారికి బోధించి వారిని ఉద్ధరించటం జరుగుతుంది."

"మహేంద్రా! ఈ విధముగా సకల శాస్త్రములు మానవుని ఉద్ధరించటానికే వున్నాయి కాని, నీవనుకొన్నట్లు వారిని లౌకిక లంపటములలో పడవేసి మరింత మాయాభ్రాంతులలో మునిగిపోయేటట్లుగా చేయనే చేయవు. ధర్మార్థ కామములను విహిత కర్మములను సక్రమముగా నిర్వర్తించినపుడే మానవుడు మోక్షార్హుడౌతాడన్న పరమ సత్యాన్ని నిర్దుష్టముగా బోధించి, నిష్కామ కర్మరతులనుగా చేసి క్రమముగా ముక్తి మార్గం వైపు నడిపించటమే సకలశాస్త్రముల ఉద్దేశం. ఆ యా శాస్త్రముల పారమార్థిక సందేశం కూడా అదే."

"మహేంద్రా! శాస్త్ర రచన యొక్క పరమార్థాన్ని వున్నది వున్నట్లు నీకు తెలియజేశాను. నేను కొత్తగా చేస్తున్నది స్వతంత్రముగా బోధిస్తున్నది అణుమాత్రమైనా లేదు. నేను చెప్పిన సప్తగాథలను వాటి అంతరార్థాన్ని వివేకముతో నీకు నీవే ఆలోచించి, శాస్త్రముల గురించి నా నిర్వచనం సరియైనదో కాదో నిర్ణయించుకో. అలా నిర్ధారించుకొని, నేను శిష్యులకు చెప్పే శాస్త్రబోధల గురించి ఏమంటావో చెప్పు" అన్నాడు బృహస్పతి.

ఈ విధముగా ఇంద్రునకు బృహస్పతి శాస్త్రవివరణను తెలియజేశాడని శ్రీ దత్తాత్రేయ యోగీంద్రుడు కార్తవీర్యార్జునకు బోధించాడు. ఎంతో శ్రద్ధతో ఆ బోధలను ఆలకిస్తున్న కార్తవీర్యార్జునుడు కుతూహలంతో " గురూత్తమా! ఓ దత్తస్వామి! అప్పుడు ఇంద్రుడు బృహస్పతికి ఏమని సమాధానమిచ్చాడు?" అని అడుగగా తదుపరి వృత్తాంతాన్ని దత్తస్వామి యిలా కొనసాగించారు.

"కార్తవీర్యా! ఇంద్రుడు విజ్ఞుడేగానీ, అజ్ఞాని కాదు గదా! అతడు గురువు చెప్పిన విషయాలన్నింటినీ తన మనసులో వితర్కించుకొన్నాడు. ఆ సప్తగాథల మర్మాన్ని బాగా అర్థం చేసుకొన్నాడు. వెంటనే అభిమానాన్ని విడచి, అహంభావాన్ని వదలిపెట్టి బృహస్పతి పాదాలపై పడ్డాడు. "గురువర్యా! అజ్ఞానముతో నిండిన నా మనస్సు మీరు చేస్తున్న పవిత్రమయిన శాస్త్రబోధల సారాంశమును అర్థము చేసుకొనలేక పోయింది. నా పొరపాటును మన్నించండి. మీరు చేసిన వివరణతో శాస్త్రముల పరమార్థాన్ని తెలుసుకొనగలిగాను. సర్వశాస్త్రముల మూలవిద్యను నివారించి పరమాత్మను చేరేదారినే సూచిస్తున్నాయి. ఆ మర్మాన్ని తెలిసికొనలేక సంశయచిత్తుడనైనాను. మీ అనుగ్రహంతో వాస్తవాన్ని గ్రహించగలిగాను ధన్యుణ్ణి." అని పలికి బృహస్పతికి నమస్కరించి శలవు తీసుకొని ఇంద్రుడు దేవలోకానికి వెళ్లిపోయాడు.

బృహస్పతి చెప్పిన సప్తగాథోదాహరణలు వినిపించి, శ్రీ దత్తాత్రేయ స్వామి కార్తవీర్యార్జునునితో " అర్జునా! నీ ప్రశ్నలకు సమాధానం లభించింది కదా? ఈ సప్తగాథలను వినిన వారికి సకల సందేహములు తొలగిపోతాయి. అవిద్య, అజ్ఞానజనితములైన మోహపాశములు త్రుంచి వేయబడతాయి. ఇందులో ఎంత మాత్రము సందేహము లేదు" అన్నారు. కార్తవీర్యుడు స్వామికి శిరసువంచి నమస్కరించాడు. స్వామితో, "ఓ దేవదేవా! మీ దయ వలన శాస్త్రముల గురించిన సరియైన అవగాహనను పొందగలిగాను. సకల శాస్త్రముల పరమోద్దేశము, లక్ష్యము ఒక్కటే! అదియే ధర్మబోధ, పరమార్థ సాధన అని మీ బోధచే తేటతెల్లమైంది. ఇంతకు ముందున్న సందేహములన్నీ తొలగిపోయాయి. నిజం చెప్పాలంటే, మానవజీవితాన్ని శాసించేవే శాస్త్రాలనీ, ఆ శాసనాలు ఐహిక ఆధ్యాత్మిక శ్రేయస్సునే బోధిస్తాయనీ అర్థమైంది. అంతేకాదు, శాస్త్రములలో ఏ ఒక్క శాస్త్రమునైనా సరే నమ్మి, ఆ శాస్త్రవిధానాలను నిర్దుష్టంగా పాటిస్తే

అతడు ఖచ్చితంగా కృతార్థుడౌతాడు. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. అలా శాస్త్ర నియమాలను పాటించకుండా, ఆ విధి విధానాలను ఆచరించకుండానే 'ఆ శాస్త్రం అలా చెప్పింది – ఈ శాస్త్రం యిలా అన్నది' అని వ్యర్థమైన సందేహాలతో, చర్చలతో కాలాన్ని దుర్వినియోగ పరచుకొనగూడదన్న మర్మాన్ని మీ దయవలన తెలిసికొన్నాను. మీ కరుణా కటాక్ష వీక్షణములచే నా మనస్సు నిర్మలమై పరమార్థ సాధనకు ఉబలాటపడుచున్నది. లౌకిక వ్యవహారముల పట్ల నిర్లిప్తత నన్ను ఆవరిస్తున్నది. సకల బంధనాలను, లంపటాలను వదలి శేష జీవితాన్ని బ్రహ్మనిష్టతో కాలము గడపాలని అనిపిస్తున్నది. మీ దీవెనలతోనే పరమార్థ సాధనను సాధించగలను తప్ప మరొక దారి లేదు. మీ అనుగ్రహముతోనే అది సాధ్యం. దేవాధి దేవా! కరుణతో ముక్తి మార్గాన్ని బోధించండి" అని వేడుకొన్నాడు. – అని వేదధర్ముడు దీపకునితో చెప్పగా, దీపకుడు "గురూత్తమా! దత్తస్వామి అర్జునుని పట్ల ప్రసన్నుడై ఎంతో కష్టతరమైన అంశములను కూడా సులభముగా అర్థమయ్యేలాగా బోధిస్తుంటే, అతనికి స్వామి దయతో తప్ప యితర విధానాలతో ముక్తి సాధింపలేమని, స్వామి అంతటి సమర్థ సద్గురుడు మరొకరు లేనే లేరనీ అనిపించటంలో ఆశ్చర్యమేమున్నది ? ఎన్నో వివరణలతో మరెన్నో ఉదాహరణలతో స్వామి అర్జునునికి జ్ఞానబోధ చేస్తున్నారు. ఆ స్వామి చెప్పిన విషయములు అర్జునునికి వలెనే నాకు కూడా ఎన్నో సందేహములను పోగొట్టాయి. అరెరే! మా వంటి వారము అజ్ఞానముతో శాస్త్రములు శాసించిన విధానాలను అనుసరించకుండానే, కొంత కొంత మా స్వంత అభిప్రాయములతో, విధానాలతో నడుచుకొంటూ, వుండటం వలన సత్ఫలితాలను పొందలేక పోతున్నాము. కానీ, మేము అందుకు కారణం మా తప్పిదమేనని గ్రహించక, శాస్త్రములను తప్పుపడుతున్నాము . ఇది ఎంతటి ఘోర అపరాధము! మహర్షులచే ప్రవచింపబడిన శాస్త్రములను అవగాహన చేసుకొని, సరిగా వాటిని అనుసరిస్తే అవి మమ్ములను పరబ్రహ్మమును చేరుస్తాయనటంలో సందేహము ఏమాత్రము లేదని యిప్పుడు తెలుసుకొన్నాను.

గురుదేవా! పరమాద్భుతమైన దత్తమాహాత్మ్యమును వీనుల విందుగా వినిపిస్తున్న మీకివే నా శతకోటి ప్రణామములు. ఆ మహా యోగీంద్రుడు తన ప్రియ శిష్యుడు అర్జునునకు బోధించిన పరతత్త్వమును నాకు కూడా బోధించి ధన్యుణ్ని చేయండి అని ప్రార్థించాడు.

వేదధర్ముడు "దీపకా! అర్జునుని ప్రార్థనను మన్నించి స్వామి "నీవు జీవన్ముక్తుడవయ్యే మార్గమును బోధిస్తాను. సావధానుడవై విను." అంటూ కార్తవీర్యార్జునునికి యిలా తత్త్వోపదేశము చేశాడు.

"అర్జునా! ఇంతకు ముందు నువ్వు నా వద్దకు వచ్చినపుడు నన్ను ధర్మార్థకామములను ప్రసాదించమని కోరావు. ఇప్పుడు ముక్తిని అడుగుచున్నావు. తప్పకుండా యిస్తాను. ఆకలిగొన్నవానికి అన్నము దాహార్తునకు నీరు, రోగికి ఔషధము, బద్ధజీవికి విముక్తి, నిద్రింప గోరే వాడికి పడక యిలా ఏది కోరిన వాడికి దానిని ప్రసాదించటం వలన ప్రయోజనం వుంటుంది గాని, ఒకటి కోరిన వాడికి మరొకటి యివ్వటం వలన లాభమేమిటి? కాబట్టి నీకు స్వస్వరూపానందాన్ని ప్రసాదిస్తాను."

"అర్జునా! ఒక్కమాట చెపుతాను శ్రద్ధగా విను బద్ధుడు, ముక్తుడు అనే రెండు పదాలు అర్థంలేనివి. అసలు యిద్దరెక్కడున్నారు? – ఆలోచించు. ఉన్నది ఒక్కటే వస్తువు. అది నామరూపాలు లేనిది. దానికి దేశము, కాలము అనేవే లేవు. అది సృష్టికి పూర్వము వున్నది. ఇప్పుడు కూడా వున్నది. ప్రళయము తర్వాత కూడా వుంటుంది. అది స్వప్రకాశము, అసామాన్యం నిర్వచనములకు అందనిది. కనుక అనిర్వాచ్యము – అకారణము – అలక్ష్యము – లక్షణాతీతము – అచింత్యము – అనికేతనము. కనుక దానిని తెలిసికొనటం కష్టము. అందువలన అజ్ఞానముతోనే దానికొక నామము, రూపము కల్పిస్తున్నాము. ఇలా ఒక అజ్ఞాన శాస్త్రాన్ని సృష్టించి, అజ్ఞాని అయిన మానవుడికి జ్ఞాన లబ్ధి చేకూర్చాలనే తాపత్రయంతో విజ్ఞులయిన వారు ముక్తి మార్గానికి బాట వేస్తున్నారు. నిజానికి యిటువంటి కల్పన లేకపోతే ఉపదేశము అసాధ్యం. ఉపదేశం లేకుంటే జ్ఞాన సముపార్జన ఎలా వీలవుతుంది? అందువలన జ్ఞానులు మాయాబద్ధులకు అజ్ఞానమే అవిద్య అనీ, భ్రమ అనీ, అదే మోహమనీ బోధిస్తారు. నిజానికి దానికి కూడా ఆది, అంతము లేవు. రూపము లేదు. ఈ విషయం శాస్త్రాలు కూడా ప్రస్తావిస్తూనే వున్నాయి. కానీ యిది కూడా పూర్తిగా వాస్తవం కాదు సుమా!

శ్లో॥ జీవ ఋూశో విశుద్ధాచితో, తథా జీవేశ యోర్భిదా
అవిద్యా తచ్చితేర్యోశ: షడస్మాక మనాదయ:॥

జీవుడు, ఈశ్వరుడు, నిర్గుణబ్రహ్మము, జీవేశ్వర భేదము, అవిద్య, అవిద్యతో బ్రహ్మము కూడుట – ఈ ఆరు అనాదులు అని తెలిసికోవాలి. తత్త్వవిచారం చేయాలి.

– సశేషం



# వార్తాలాపము

**జనవరి సంచిక తరువాయి** **(సీరియల్)**

## ఇరువదినాలుగవ ప్రసంగము

శ్రీ ప్రకాశానందులవారు గోండలులో ఉన్నపుడు జూనాగఢ్ నుండి ప్రొఫెసర్ మహాదేవమల్లార్ జోశీ వారి దర్శనమునకు వచ్చిరి. ఆయన స్వామివారిని జూనాగఢ్ దయచేయమని ప్రార్థించిరి. కొద్ది రోజుల తరువాత వచ్చెదనని స్వామివారు చెప్పిరి. పీఠడియా దర్శనము చేసికొని వచ్చెదమని సెలవిచ్చిరి. ఇది విని ప్రొఫెసరు గారు ఇట్లనిరి:- నేనుకూడ వారిపేరు వింటిని. కాని దర్శనము మాత్రము చేయలేదు. నేను కూడ అక్కడికి వచ్చి అచ్చటినుండి తమను తీసుకొని జూనాగఢ్ వెళ్ళెదను. మూడురోజుల తరువాత స్వామి ప్రకాశానందులవారు, ఉదయశంకరవకీలు, దయాశంకరభాయి ముగ్గురును ఉదయపుర్రైలుబండిలో పీఠడియా వెళ్లిరి. ఆ సమయమున శ్రీ నిత్యానందస్వామివారి ఆశ్రమద్వారమునకు బయట తాళము వేసియుండెను. కావున అచ్చటి మనుష్యుడు తాళముచెవి తీసికొని వచ్చుటకు వెళ్ళెను. శ్రీ స్వామివారును ఉదయశంకరవకీలును అచ్చటి అరుగుపై కూర్చొనిరి. ఆ సమయమున శ్రీ స్వామివారు చెప్పిరి. భాగవతమునందు చెప్పబడినది.

గృహస్థస్య క్రియత్యాగో వ్రతత్యాగో వటోరపి।
తపస్వినో గ్రామసేవా భిక్షోరిన్ద్రియలోలతా॥

గృహస్థుడు కర్మను త్యజించినను, బ్రహ్మచారి బ్రహ్మచర్య వ్రతమును త్యజించినను, వానప్రస్థుడు గ్రామములయందు నివసించినను, సన్యాసి విషయాసక్తుడైనను,

ఆశ్రమాపసదా హ్యేతే ఖల్వాశ్రమవిడమ్బకాః।
దేవమాయావిమూఢాంస్తా ఉపేక్షేతానుకమ్పయా॥

అట్టివారు ఆశ్రమాడంబరమును చేయువారును, ఆశ్రమవాసులలో అధములును అగుదురు. జ్ఞానియగు పురుషుడు ఈశ్వరమాయా నిమగ్నులయిన అట్టివారిని ఉపేక్షాభావముతో చూచును.

నేను ఇంకను ఇంద్రియలోలుడనే. కావుననే స్వామివారు నాయందు ఉపేక్షాభావము వహించి నాకు దర్శనము ఇచ్చుటలేదు.

ఉదయశం:- తమరు ఇట్లు బ్రాహ్మణులు శిలోంఛవృత్త్యాది సాధనములు లేనందున రోజంతయు వ్యావహారిక జీవితమున గడపవలసివచ్చుచున్నది. ఇక నిత్య, నైమిత్తికాది ఐహికకర్మములు ఎట్లు ఆచరించగలరు? సన్యాసులనే ప్రమత్తులుగా పేర్కొనవలెను. ఇంతలో ఆశ్రమద్వారము తెరువబడెను. స్వాములు ఇరువురును ఒకరినొకరు కుశలప్రశ్నలు వేసిరి. స్వామి ప్రకాశానందులవారు తమతో కూడ వచ్చినవ్యక్తులను శ్రీ నిత్యానందస్వామివారికి ఎరుకపరచిరి.

సాయంకాలము నాలుగుగంటలకు అందరును టీ తీసుకొని కూర్చొనిరి. ఆ సమయమున ఉదయశంకరవకీలు నిత్యానందులవారిని ప్రశ్నించెను.

"నేను చాలాకాలమునుండి సంధ్యావందనాది నిత్యకర్మములను ఆచరించుచున్నాను. అయినను అంత:కరణము శిద్ధినొందుట లేదు. ఇందుకు కారణమేమి?

### జీవితనిర్వహణసాధనమునకును అంత:కరణమునకునుగల సంబంధము

స్వా. ని. :- మీరేమి చేయుచున్నారు?

ఉదయ:- వకీలు వృత్తిని.

### రాజనప్రకృతులు పది రకములు

స్వా. ని. :- పూర్వకాలము వకీలు వృత్తిలేదు. రాజసస్వభావములు రాజనీతి ప్రకరణమున పదిరకములుగా చెప్పబడినవి.

1. పురోహితుడు (వేదోక్త కర్మములను ఆచరింపజేయువాడు), 2. ప్రతినిధి, 3. ప్రధాని, 4. సచివుడు, 5. మంత్రి, 6. పండితుడు, (రాజునకు చెప్పదగిన రహస్యములను చెప్పువాడు), 7. ప్రాడ్వివాకుడు, (న్యాయాధిపతి), 8. అమాత్యుడు, (ప్రధానికి సహాయపడువాడు అనగా ఉపప్రధాని), 9. సుమంత్రుడు, 10. దూత, సుదూత, పరమసుదూత అని.

వీనియందు వకీలువృత్తి చెప్పబడలేదు. పూర్వము విద్యాభ్యాసము చేయు అలవాటు ఉండుటచే వకీలు అవసరము లేకుండెను. ఈ రోజులలో విద్యాభ్యాసము తగ్గి రైతులు మొదలగు బీదవారికిని, రాజులకును, రాజోద్యోగులకును కల సంబంధములు హీనముగా నుండుటచే ప్రజలు భయభ్రాంతులును, అజ్ఞానులును అయిపోయిరి. కావున అధికారి సామాన్యజనుని కార్యవశమున ఏదైన ప్రశ్న అడిగినచో తగిన సమాధానము చెప్పలేకపోవుచున్నాడు. భయపెట్టి అడిగినచో మాట్లాడడుకూడను. ఈ విధముగ నేరములు మొదలగువానిని నిర్ణయించుటలో యథార్థము తెలిసికొనుట కష్టము. అట్టివారి యథార్థవిషయములను న్యాయాధికారికి

తెలుపుటకు ప్రయత్నించు వ్యక్తుల నేరికొనుట ధర్మము. అంతేకాని న్యాయశాస్త్రపు ఆడంబరముతో నిజమును అబద్ధముగా ఋజువుచేసి ఇష్టమువచ్చిన డబ్బు గుంజుకొనుట వృత్తికాదు. ఈ కాలమునందలి వకీలువృత్తిలో ఈ తప్పుపనులు తప్పని సరిగా జరుగుచున్నవి. మీ జీవనోపాయము పరిశుద్ధముగానుండదు. శుద్ధమగు జీవనోపాయము లేనందున అంతఃకరణము పరిశుద్ధముగానుండదు.

వృత్తినిగురించి మనస్మృతియందు కొన్ని శ్లోకములు గలవు. అవి నాకు కంఠస్థము కావు. మనుస్మృతి తెరచి వాటిని వివరించిరి.

అద్రోహేణైవ భూతానామల్పద్రోహేణ వాపునః।
యావృత్తిస్తాం సమాస్థాయ విప్రో జీవేదనాపది॥

"బ్రాహ్మణుడు ఆపత్కాలమున ఏ ప్రాణికిని ద్రోహము చేయని వృత్తిని అవలంబించవలెను. అది వీలుకానిచో వీలైనంత తక్కువద్రోహము కలుగునదియే ఆచరించవలెను. అట్టి వృత్తితో జీవితము గడుపుకొనవలెను.

యాత్రామాత్రప్రసిద్ధ్యర్థం స్వైః కర్మభిరగర్హితైః।
అక్లేశేన శరీరస్య కుర్వీత ధనసంచయమ్॥

"తన ప్రాణరక్షణమునకొరకు నింద్యముకాని కర్మలను ఆచరించి, శరీరమును బాధించకుండ ధనమును సంపాదించవలెను."

ఋతామృతాభ్యాం జీవేత్తు మృతేన ప్రమృతేనవా।
సత్యానృతా భ్యామపివా నశ్వవృత్త్యా కదాచన॥

"జీవితము అంతటను ఋతము, అమృతము, మృతము, ప్రమృతము, సత్యము, అనృతము వీనిని దృష్టిలోనుంచుకొని జీవితము గడపవలెను. కాని కుక్కవలె జీవితము గడపరాదు."

ఋతముఞ్ఛశిలంజ్ఞేయం అమృతం స్యాదయాచితమ్।
మృతంతుయాచితం భైక్షం ప్రమృతం కర్షణం స్మృతమ్॥

ఉంఛము, శిలము అని ఋతము రెండు రకములు, ఉంఛవృత్తితో జీవితమును నిర్వహించుకొనదలచినచో ఎవరికిని హాని కలుగని విధముగ త్రోవలోను, పొలములోను మిగిలినధాన్యమును ఒక్కొక్కగింజచొప్పున ఏరుకొని వానిని ఉపయోగించుకొనవలెను. ఇది సర్వశ్రేష్ఠమగు వృత్తి.

**రెండవరకపు వృత్తి**

శిలవృత్తి అనగా ధాన్యపు వెన్నులను సంపాదించి గింజలను ప్రోగుచేయుట. ఈ వృత్తి రెండవతరగతికి చెందినది.

ఈ రెండువృత్తులయందును కపటమునకు తావు లేదు. ఈ రెండువృత్తులను 'ఋతము' అని చెప్పుదురు. ఋతమనగా సత్యము. అడుగనిదే శ్రద్ధాసక్తులు కలవారు ఇచ్చినది 'అమృతము', ఇదికూడ ఉత్తమమైన వృత్తియే. భిక్షాటనము చేసి కొంచెము కొంచెము సంపాదించుట 'మృతము' అనబడును. ఇది సాధారణమైన వృత్తి ఏలనన, అందు అడుగుకొనవలసియున్నది. వ్యవసాయము చేసి జీవితమును గడుపుకొనుట 'ప్రమృతవృతి'. అందు చాల పరిశ్రమ చేయవలసివచ్చును. బ్రాహ్మణజీవితమునకు లక్ష్యములయిన అధ్యయనాధ్యాపనములకు అంతరాయము కలుగును.

సత్యానృతంతు వాణిజ్యం తేన చైవాపి జీవ్యతే।
సేవా శ్వవృత్తిరాఖ్యాఆ తస్మాత్తాం పరివర్జయేత్॥

వ్యాపారముచేసి జీవితము గడుపుకొనుట శ్వవృత్తి. కావున ఆ శ్వవృత్తిని త్యజించవలెను. ఆపద్ధర్మముగా జీవితమును గడుపుకొనుటకు వాణిజ్యమును గ్రహించవచ్చును.

ఉదయ:– తమరు సెలవిచ్చినట్లు పూర్వము జనులు శిలోంఛ వృత్తులతో జీవితము గడిపెడివారు. కాని కాలక్రమమున ఆ వృత్తులు పోయినవి. పూర్వకాలమున మనుష్యులు తక్కువ, పంటలు ఎక్కువ, రైతులు కొంతభాగము మాత్రమే పంటలచేలనుండి తీసికొని వెళ్ళెడివారు. మిగిలినది చేనులోనే విడచెడివారు. జనులు ఆ పంటనుండి శిలోంఛవృత్తులద్వారా తమ జీవితమునకు కావలసిన ఆహారధాన్యములను సంపాదించెడివారు. ఇప్పుడు భారత దేశపు జనాభా పెరిగిపోయినది. ఆహారధాన్యములు ఆ ప్రకారము పండుటలేదు. కావున శిలోఉంఛ వృత్తులతో ప్రస్తుతము జీవితము గడుపుకొనుట అసంభవము. కాలధర్మవశమున జనులు ఏదోరీతిని పొట్టపోషించుకొనవలసివచ్చుచున్నది. డబ్బు సంపాదించుటకు వేరువేరు వృత్తులు చేయవలసివచ్చుచున్నది. వకీలు వృత్తితో అబద్ధములాడి సంపాదించినచో జీవితము శుద్ధమైనదికాదని నాకు తెలియును. కాని ఏమి చేయుదును? ఈ వృత్తిని విడచిపెట్టలేనుకదా! ఆయన నాకు తెలిసినంతవరకు సత్యపుకేసులు తీసికొనుటలేదు. పొరబాటున అబద్ధపుకేసు తీసికొనినచో తెలిసినవెంటనే వారి డబ్బు వాపసు ఇచ్చి కేసు విడచిపెట్టుచున్నారు. తప్పుడుద్రోవను డబ్బు సంపాదించినచో ఆ ఫలితము నేను అనుభవించవలసివచ్చును అని నేను ఎరుగుదును.

– సశేషం

# తాత్యా డైరీ

(గత సంచిక తరువాయి)

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

బాబా తరుచూ నా పైపంచను మసీదులో గోధుమల బస్తా చాటునగాని, మరెక్కడైనాగాని దాచి, నా పంచె ఎక్కడుందని ఆతురతగా నేనడగ్గానే ఆయనెప్పుడూ చెప్పే సమాధానమొక్కటే–"నాకేం తెలుసు? నేనితరుల పంచెలు దొంగలిస్తానా ఏమి?". అయితే ఆయనే అలాంటి చిలిపిపని చేసి యుండాలని నేననేవాడిని. ఆయన ఆ వస్తువు కన్పించనందుకు ఆతురతను నటిస్తూ, దాని కొసం వెదికినట్లు నటించి దానిని బయటకు తీసేవారు. ఒక్కొక్కసారి వారు నా పైపంచను కప్పుకొని నా నడక, భంగిమలు, మాటతీరు అనుకరించి చూపేవారు. ఒక్కొక్కసారి నా చేతిని తన చేతితో పట్టుకొని నా బలాన్ని చూపమని నాచేతిని నొక్కేవారు. నేను ఎదురు నెట్టగానే తన చేతి ఎముకలను నేను విరిచేసినట్లు బాధను నటించేవారు. ఒకసారి నేనాయన తలకున్న తెల్లగుడ్డకట్టును తీసేసి నా గ్వాలియర్ తలపాగాను ఆయన శిరస్సుపై పెట్టి, పైపంచ కప్పి అద్దంలో చూపించాను. ఆయన ఆ తమాషాకు ఆనందించారు. అద్దంలో చూచుకొని భుజాలెగురవేసి, వెక్కిరించినట్లు కనుగుడ్లు తిప్పి, "ఓ అద్దమా! ఈ కోత్యా నేనున్నట్టే ఉంటాడా? నేను చేసినట్లే చేస్తాడా? చెప్పుమా!" అన్నారు.

ఒకనాడు అకస్మాత్తుగా బాబా లేచి కూర్చుని నా పాదాలు తాకారు. నాకెంతో బాధ అన్పించింది. ఆయన చేతులు పట్టుకొని, బాధతో నిండిన కంఠంతో "మీరలా చేయడం తగునా?" అని

**ఆయన తన చేతులు విడిపించుకొని మరలా నా పాదాలు తాకి నమస్కరించారు. నాకు మరింత ఘోరంగా అన్పించి, "బాబా! ఏమిటి మీరు చేస్తున్నది?'' అన్నాను. బాబా "నోరుముయ్! ఏం తెలుసు నీకు?" అన్నారు.**

అడిగాను. ఆయన తన చేతులు విడిపించుకొని మరలా నా పాదాలు తాకి నమస్కరించారు. నాకు మరింత ఘోరంగా అన్పించి, "బాబా! ఏమిటి మీరు చేస్తున్నది?" అన్నాను. బాబా "నోరుముయ్! ఏం తెలుసు నీకు?" అన్నారు. ఒక్కొక్కసారి ఆయన నా ముందు నమస్కరిస్తూ నిలుచుని "జైదేవా! జైదేవా!" అంటున్నారు. నాకు వారి చర్యలకు దిగ్భ్రమ కలిగింది.

మసీదులో ఇప్పుడు పెద్ద సాయిబాబా పటమున్న ప్రదేశంలో పడమరవైపుకు తలబెట్టుకొని బాబా నిద్రించేవారు. నేను ఉత్తరంగా తలబెట్టుకొని దక్షిణంవైపుకు కాళ్ళు పెట్టుకొని పడుకొనేవాడిని. బాబాకు దక్షిణంగా తలను పడమరకు పెట్టి పాదాలు తూర్పుకు పెట్టుకొని మహల్సాపతి పడుకునేవాడు. గాఢనిద్రలో మాలో ఒకరి కాళ్ళ మీద ఒకరి కాళ్ళుపడి పెనవేసుకొనేవి. తెల్లవారి మేము నిద్రలేచేసరికి మాకే తమాషాగా అన్పించి నవ్వు వచ్చేది. మా కాళ్ళు సహజంగానే పెనవేసుకొన్నాయో లేక బాబా అలా చేశారో మాకు అర్థమయ్యేదిగాదు. ఒక్కొక్కసారి బాబా కాళ్ళు మా కాళ్ళ మీద ఉండేవి. కాని మరోవిధంగా ఉన్నప్పుడు మేమెంతో అపచారం చేసినట్లు మాకు బాధ కల్గేది. ఈ విధంగా ముగ్గురమూ మసీదులో నిద్రించేవారము. సామాన్యంగా మేము రాత్రి 9–9.30 గంటలకి పడుకొనేవాళ్ళము. కొద్దిసేపు నిద్రించాక మహల్సాపతి నిద్రలేచి మసీదులోని ప్రమిదలలో నూనె నింపి, వత్తులు సవరించి బాబా రొట్టెలు పెట్టుకున్న కుండ మీద పళ్ళెం మూతవేసి, ధునిలో కట్టెలు వేసేవాడు.

నేను పగలంతా కష్టించి వస్తాననీ, నా ఒళ్ళు, అవయవాలు నొప్పులుగా ఉంటాయనీ బాబాకు తెలుసు. కనుక నేను నిద్రలో వున్నప్పుడు బాబా, మహల్సాపతి నా ఒళ్ళు, కాళ్ళు, చేతులు పిసికేవారు. నాకదెంతో బాధనిపించేది. ఒకనాడు యిది సమంజసం గాదని మహల్సాపతితోనూ, బాబాతోనూ, నిక్కచ్చిగా అనేశాను. నేను వారికి సేవ చేయవలసినదిపోయి వారి చేత సేవ చేయించుకోవడమేమిటి? చివరికి అలా అయితే నేను పగలుగాని, రాత్రికాని మసీదుకే రానని బెదిరించాను. అలానే చేశాను గూడ. 10,12 రోజులు మసీదు ఛాయలకు వెళ్ళలేదు. బాబా బాధపడ్డారు. ఆయన దూరాన్నుండి వెళుతున్న నన్ను కేకవేసేవారు; నేను సైగలతో ఆయనతో నాకెట్టి సంబంధమూ లేదని తెల్పి వెళ్ళిపోయేవాడిని. అప్పుడు కాకాసాహెబ్ శిరిడీ వచ్చి, నేను మసీదుకు వెళ్ళడంలేదని తెలుసుకొని , నేను బయాజామామి కొడుకునైనందువలన బాబాకు నేనంటే ఎంతో ప్రేమ అని, కనుక నేను నా నిర్ణయాన్ని మార్చుకొని మసీదుకు వెళ్ళడం ప్రారంభించాలని నచ్చచెప్పాడు.

మూడు, నాల్గు సంవత్సారాలపాటు తరచుగా మహల్సాపతికి సుస్తీ చేస్తూండేది. కనుక అప్పుడు అతను చూచుకొనే మశీదు పనులన్నీ నేనే చూచుకొనేవాడిని – దీపాలలో నూనె, వత్తులు వేస్తూండడం, వత్తులు సిద్ధంగా చేసి పెట్టుకోవడం, బాబాకు చిలిమ్ తయారు చేసివ్వడం వంటివి. తర్వాత బాబా మహల్సాపతిని యింటికి వెళ్ళమని చెప్పి, మసీదులో పడుకోనివ్వలేదు. నేను మాత్రం మరి 14,15 సం॥ వరకూ మసీదులో తోడుగా రాత్రిళ్ళు నిద్రించేవాడిని. వారి మహాసమాధికి 4,6 సం॥లకు ముందు నేను మసీదులో నిద్రించడం మానుకున్నాను.

ఒకరోజు బాబా నా చేతికి నాల్గు రూపాయలిచ్చి తమకు తమలపాకులు, మరికొన్ని చిల్లరవస్తువులు, రేగిపళ్ళు కొనుక్కుని రమ్మనారు. నేను వెంటనే రహటాలోని సంతకు వెళ్ళి అన్నీ కొనితెచ్చి ఆయన ముందుంచి, "బాబా మీరు రేగిపళ్ళు తెమ్మన్నారు. నేనెంత మంచి పండ్లు మీకోసం తెచ్చానో చూడండి!" అన్నాను. బాబా ఒక్క పండును కూడా ముట్టకుండా అన్నింటినీ నాకు, మహల్సాపతికీ యిచ్చేశారు. నేను వాటిని తీసుకోకుండా ఆయన గూడా కొన్నింటిని తీసుకొంటేనే నేను తింటానని పట్టుబట్టాను. తమకప్పుడు వాటిని తినాలని లేదని చెప్పి నన్నే తీసుకోమన్నారు. ఇలా చాలాసేపు రాద్ధాంతం జరిగింది. ఆయనగాని, నేనుగాని మా నిర్ణయాలు మార్చుకోలేదు. నాకు ఓర్పు పోయి కోపంకూడా వచ్చింది. పండ్లన్నింటినీ ఒక రుమాలులో మూటగట్టి మసీదు నుండి వెడలిపోయి, రాత్రి వాటినన్నీ తెచ్చి ఆయన ముందుంచి అప్పుడైనా కొన్నింటిని తినమని వారిని బ్రతిమలాడాను. ఆయన పట్టుదలగా ముందు నేనే తినాలన్నారు. ఇలాగే మరలా కొంతసేపు పేచీలు, పంతాలు సాగాయి. నాకు కోపమొచ్చి పండ్లన్నింటిని మసీదు ముంగిట విసిరిపారేసి అప్పుడు ప్రదర్శించబడుతున్న ఒక వీధినాటకం చూడడానికి వెళ్ళిపోయాను. నేను వెళ్ళాక బాబా, మహల్సాపతి కలసి ముంగిలంతటా చెల్లాచెదురుగా పడిన రేగుపళ్ళన్నింటినీ ఏరారు. అపుడు నన్ను పిలుచుకురమ్మని మహల్సాపతిని బాబా పంపారు. ఎంతో ఆశతో తిరిగివచ్చిన నేను మరలా పాత పట్టింపే కొనసాగడం చూచి చాలా నిరుత్సాహపడ్డాను. కోపంతో మరలా నేను వీధినాటకానికి వెళ్ళిపోయాను. నన్ను ఒప్పించి పిలుచుకు రావడానికి దగ్గూ, కొండ్యా అనే యిద్దరిని బాబా పంపారు. కాని మొండిపట్టుబట్టాను. అపుడు మహల్సాపతి వచ్చి బాబా నా కోసం ఎంతో ఆతురతతో ఎదురుచూస్తున్నారని చెప్పాడు. మొదట నేను మూర్ఖించాను గాని చివరకు వెళ్ళక తప్పలేదు. నేనెంతో కోపంమీద ఉన్నాను. బాబా కొన్ని రేగుపండ్లను తమ పెదవులతో మాత్రం తాకి, కొన్నింటిని మహల్సాపతికిచ్చి, "మహల్సాపతి, నీవు తిని, కొన్నింటినీతడికిచ్చి తినమని చెప్పు" అన్నారు. నా అహము, పట్టుదల చల్లారిపోయాయి. ఆ రాత్రంతా బాబా నాతో మాట్లాడలేదు.

నేను ఏకాదశి, శ్రావణ సోమవారాలు, మహాశివరాత్రి సమయాలలో తప్పక ఉపవసించేవాడిని. కాని ఉపవాసం వలన ఐహికంగా గాని, ఆధ్యాత్మికంగా గాని ఏమీ ప్రయోజనం లేదని బాబా అభిప్రాయం. అటువంటి రోజులలో నేనెంతగా ఉపవసించాలని యత్నించినా బాబా నా చేత ఏదో ఒకటి తినిపించి ఉపవాసాన్ని భంగం చేసేవారు. ఒక శివరాత్రినాడు నేను సాయితో అన్నాను, "బాబా! దయచేసి కనీసం శివరాత్రి నాడైనా నా చేత ఏమీ తినిపించవద్దు. నన్ను ఉపవసించనివ్వండి!" "తినరా, తిను! ఏం శివరాత్రి?" అన్నారు బాబా. దాదాకేల్కరు గూడ బాబా చెప్పినట్లే చేయమనీ, ఆయన ఆజ్ఞను ఉల్లఘించవద్దనీ నన్ను హెచ్చరించాడు. నేనిక అడ్డు చెప్పలేదు. నాటి నుంచీ నేనేరోజునా ఉపవసించలేదు. ఒక్కొక్కప్పుడు బాబా ఒకానొక పారవశ్యంలో ఉండేవారు. అట్టి అరుదైన సమయాలలో చేత తంబురా ధరించి పారవశ్యంతో ఒడలు తెలియని రీతిన నృత్యం చేసేవారు. అత్యంత క్రమబద్ధమైన వారి భంగిమలు కర, నేత్ర, హస్తముల కదలికలూ చూచేవారందర్నీ మంత్రముగ్ధుల్ని చేసేవి. ఎంతో మధురమైన కంఠస్వరంతో అయనెంతో గొప్పగా పాడేవారు గూడాను. నృత్యంలో తాము పిల్లనగ్రోవి వాయిస్తున్నట్లు భంగిమచేస్తూ ఒక కాలును మరొక కాలి ఎదుట అడ్డంగా మలచి ఉంచినపుడు చూచినవారందరికి తాము సాయిని గాక బృందావన శ్రీకృష్ణుని చూస్తున్నట్లే ఉండేది. అట్టి భావపారవశ్యంలో ఆయనను చూచిన వారందరికీ గూడ పారవశ్యం గల్గి ఏదో పారలౌకికమైన దృశ్యాన్ని చూస్తున్నట్లనిపించేది.

**నృత్యంలో తాము పిల్లనగ్రోవి వాయిస్తున్నట్లు భంగిమచేస్తూ ఒక కాలును మరొక కాలి ఎదుట అడ్డంగా మలచి ఉంచినపుడు చూచినవారందరికి తాము సాయిని గాక బృందావన శ్రీకృష్ణుని చూస్తున్నట్లే ఉండేది. అట్టి భావపారవశ్యంలో ఆయనను చూచిన వారందరికీ గూడ పారవశ్యం గల్గి ఏదో పారలౌకికమైన దృశ్యాన్ని చూస్తున్నట్లనిపించేది.**

ప్రతిరోజూ సాయి రు. 15/- లేక 20/- పెట్టి మిఠాయి, పండ్లు మొదలైన తినుబండారాలను కొని తమ దర్శనార్థం మసీదుకొచ్చే భక్తులందరకూ ప్రసాదంగా పంచేవారు. ప్రతిరోజూ రాత్రి నేను మసీదుకు కొద్ది రొట్టెలను గాని, సంగటి ముద్దలను గాని తీసుకొని, పాలు, బెల్లము గూడా తీసుకువెళ్ళి బాబా ముందుంచేవాడిని. తీసుకెళ్ళిన దానిలో మూడువంతుల రొట్టెలను ముక్కలు చేసి పాలు, బెల్లం కలిపి ఆయన దగ్గర పెట్టేవాడిని. ఆయన కొంచెం తిని ఆ పాత్రను దూరంగా నెట్టేసేవారు. దానిని, మరొక సంగటి ముద్దను కొండ్యా ప్రసాదంగా తీసుకొనేవాడు. తర్వాత నేను తెచ్చిన యితర తినుబండారాలను ఆయనకు సమర్పించేవాడిని. అందులో కొంచెం ఆయన తిని కొంచెం నా నోట్లో పెట్టేవారు. అపుడు కొండ్యా కొన్ని కిళ్ళీలు తయారుచేసేవాడు. సాయి వాటిలో కొన్నింటిని తిని మిగిలిన వాటిని భక్తులకు విసిరేసేవారు. వారెంతో శ్రద్ధాభక్తులతో వాటిని తీసుకొని

ప్రసాదంగా తినేవారు. కిళ్ళీలు నమిలాక బాబా ఎక్కువగా మంచినీరు త్రాగేవారు. ఆయనకు తాంబూలమెంతో ఇష్టం. రాత్రి పగలు గూడా తినేవారు. మొదట కొండ్యా, తర్వాత రాధాకృష్ణమాయి సిద్ధం చేసిచ్చేవాళ్ళు.

బాబాకు రెండు మేకలు,రెండు ఆవులు వుండేవి. వాటిని మా యింటివద్దనే వుంచి మేపేవారు. వాటి పాలు, పెరుగు బాబా స్వల్పంగా సేవించేవారు. రాధాకృష్ణమాయి మొదట పండరిపురం నుండి వచ్చారు. ఒకరోజు ఆమె అకస్మాత్తుగా పండరి దర్శనార్థం కాలినడకన వెళ్ళదలిచినట్లు తెలిపారు. ఆమెతో కూడ బాలాషింపే, మధవ్‌ఫస్లే కూడ బయలుదేరుతున్నారట. వారు ఆషాఢ ఏకాదశి పూజలో పాల్గొనాలని వారి నిశ్చయం. ఇది తెలసి మా అమ్మ, మరికొందరు గ్రామస్థులుగూడ వెళ్ళాలనుకున్నారు. మేము మొదట అహమ్మద్‌నగర్ వెళ్ళి, అక్కడ రాధాకృష్ణమాయిని వారి బృందాన్ని కలసి కాలినడకనే చేరాలనుకున్నాము. మా అమ్మ, బావ, లక్ష్మీబాయి షిండే, నా పెద్దకుమార్తె, మరి నలుగురు స్త్రీలు బయలుదేరడానికి సిద్ధమయ్యారు. మేమంతా బాబా దర్శన ఆశీస్సుల కోసం మశీదుకు వెళ్ళాము. ఆయన ఆశీర్వదించి విభూతినిచ్చారు. సామానుతో నిండిన మూడు బండ్లు గ్రామ బావివద్ద చెట్టుక్రింద సిద్ధంగా నిలచాయి. నేను మా యాత్ర విజయవంతం కావటానికి మారుతి ఆలయంలో టెంకాయకొట్టి శనిదేవుని ఆలయానికి వెళ్ళాను. మాకు వీడ్కోలు చెప్పడానికి సుమారు 50 మంది గ్రామస్థులు చెట్టుక్రింద సమావేశమయ్యారు. అకస్మాత్తుగా యీనాడు సమాధి మందిరమున్న భూమిమీద సాయి మాకు కన్పించేసరికి ఆశ్చర్యపోయాము. నేను శని మందిరంలో టెంకాయ కొట్టి బయటకువచ్చేసరికి కొండ్యాజీ అను ముస్లిం సోదరుడు వచ్చి బాబా పిలుస్తున్నారని చెప్పాడు. బాబా నిలచిన స్థలానికి వెళ్ళాను. ఆయన నన్ను మసీదుకు తీసుకువెళ్ళారు. కొందరు నాతో మసీదుకు వచ్చారు. కొందరు చెట్టు క్రింద వేచియున్నారు. బాబా తమ యథాస్థానంలో కూర్చొన్నారు. నేను కటకటాల దగ్గర, నా యెదుట మాధవరావు దేశ్పాండే కూర్చున్నాడు. మాధవరావు చిలుమ్ వెల్గించి బాబాకందించాడు. బాబా నాలుగైదుసార్లు పొగపీల్చారు. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. చివరకి మాధవరావు బాబాతో, "దేవా! మీ బయాజామాయీ వాళ్ళు యితడికోసం వేచియున్నారు. పండరీ బయలుదేరడానికంతా సిద్ధమయ్యారు'' అన్నాడు. "బయాజామాయిని పిలిపించండి" అన్నారు బాబా. ఆమె వచ్చి ఆతురుతగా ''బాబా! ఏమి పిలిచారట? సూర్యుడస్తమించబోతున్నాడు. అందరూ ఆతురుతగా మాకోసం వేచియున్నారు. బయలుదేరే సమయమవుతూంది" అన్నది. బాబా ప్రశాంతంగా అన్నారు, "మాయీ, నీవింటికెళ్ళు. ఇవ్వాళ వెళ్ళవద్దు. రేపూ వెళ్ళవద్దు. ఎల్లుండి వెళ్లు. ఈ విషయంలో నీవెవ్వరినీ విచారించనక్కరలేదు. ఊది తీసుకో!" "సరే బాబా, ఎల్లుండే వెడతాము" అన్నది మా అమ్మ. బండ్లలోని సామాన్లు దించి, బండ్లను వెనుకకు పంపేసారు. స్నేహితులు, బంధువులు యిళ్ళకు తిరిగొచ్చారు. మాధవరావు పంచాంగం చూస్తే ఆరోజు ప్రయాణానికి తగదని తేలింది.

మూడవరోజు ఉదయమే మేము ప్రయాణానికి సిద్ధమయ్యాము. బాబా చాలా ఉత్సాహంగా వున్నారు. ప్రతి ఒక్కరికీ ఊదీయిచ్చి రోడ్డువరకు వచ్చి సాగనంపారు.

మేము అనుకొన్న ప్రకారం పుంతంబా చేరి, స్నానాలు చేసుకొని, అల్పాహారం తీసుకొని బేవూర్‌కు రైలు ఎక్కాము. ఉదయం 8 గంటలకు ఆ పట్టణం జేరాము. 9 గం॥కు రాధాకృష్ణమాయీ బృందాన్ని కలుసుకున్నాము. భోజన సమయానికి నరసింగ్‌పూర్ చేరి శ్రీ నరసింగ్ మహారాజుగారి దర్శనం చేసుకున్నాము. మరురోజు సాయంత్రానికి పండరీపురం చేరాము.

**బాబా తమ యథాస్థానంలో కూర్చొన్నారు. నేను కటకటాల దగ్గర, నా యెదుట మాధవరావు దేశ్పాండే కూర్చున్నాడు. మాధవరావు చిలుమ్ వెల్గించి బాబాకందించాడు. బాబా నాలుగైదుసార్లు పొగపీల్చారు. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. చివరకి మాధవరావు బాబాతో, "దేవా! మీ బయాజామాయీ వాళ్ళు యితడికోసం వేచియున్నారు. పండరీ బయలుదేరడానికంతా సిద్ధమయ్యారు" అన్నాడు. "బయాజామాయిని పిలిపించండి" అన్నారు బాబా.**

పండరీపురంలో ఏకాదశినాడే కలరా వ్యాధి చెలరేగింది. ద్వాదశినాటికి బాగా విజృభించింది. మా బృందంలోనివారంతా భయపడి తిరిగి వెళ్ళిపోదామని పట్టుబట్టారు. కాని నేను పూర్ణిమవరకు అక్కడే వుందామని పట్టుబట్టాను. మా అమ్మ బాగా భయపడిపోయింది. ఆమె అక్కడ పనిచేస్తున్న నానా చందోర్కర్‌ను కలసి వెంటనే తిరిగి వెళ్ళడానికి నన్ను వప్పించమని ఆతడిని కోరినది. నన్ను, బాలాషింపేను రమ్మని నానా కబురు చేసారు. సర్వజ్ఞుడైన బాబాకు పండరీపురంలో కలరావ్యాధి చెలరేగుతుందని ముందే తెలుసు. కానీ మా ఉత్సాహం చూచి యాత్ర మాన్పించలేకపోయారు.

# శ్రీ భరద్వాజ రచనామృతం

[illegible]

[illegible]

[illegible]

# శ్రీ భరద్వాజ రచనామృతం

మనిషి–మాను

"సర్వం ప్రాణాయే జాతి నిహిస్రితమ్"–"సర్వం ప్రాణం నుండే వుత్పన్నమై అందులోనే చరిస్తుంటాయి" అని చెప్పింది ఉపనిషత్తు. 'పాతరోత' అని గొంతులు చించుకునే వారికి కనువిప్పు కల్గేలా – చిరకాలం తెలియని వైజ్ఞానిక విశేషాలు–చెట్ల గురించినవి – ఈ ఉపనిషద్వాక్యాన్ని మరింతగా నిరూపిస్తున్నాయి. వెనుక యీ నిగూఢమైన సత్యం చెప్పినది మన దేశానికి చెందిన ఋషులే. మరలా ఆధునిక ప్రపంచానికి మహత్తరమైన యీ సత్యాన్ని వైజ్ఞానికంగా నిరూపించి చూపినది మన భారతీయ శాస్త్రజ్ఞుడే – శ్రీ జగదీశ్ చంద్ర బోస్. నిజానికాయన ఆ విషయం తెల్పకుంటే మనకు, భూమిపై జీవులన్నింటికీ అతి సన్నిహితమైన చెట్లు, మొక్కలగురించి ఎన్నో విశేషాలు నేటి ప్రపంచానికి తెలిసేవేగావు.

సం॥ 1900లో విజ్ఞాన శాస్త్ర పరిశోధనలకు సంబంధించిన అంతర్జాతీయ ప్రదర్శన 'పారిస్' నగరంలో జరుగుతోంది. స్వామి వివేకానంద గూడ యీ ప్రదర్శనను సందర్శించి, ఎందరెందరో ప్రఖ్యాత విదేశీయ విజ్ఞాన శాస్త్రవేత్తలు అందులో పాల్గొనడం చూచి వారితో సమానుడైన భారతీయులొక్కరైనా అందులో పాల్గొన గల్గితే ఎంత బాగుండునో అనుకున్నారు. కొద్దిసేపట్లోనే ఆయన అభీష్టం నెరవేరింది–బంగాలుకు చెందిన శ్రీ జగదీశ చంద్ర బోసు వేదిక మీదకొచ్చారు! ఆయన లోకానికి అందించిన మహత్తరమైన అంశాన్ని గురించి లండన్ నగరంలోని ఒక దిన పత్రిక యిలా వ్రాసింది.

"ఆయన (శ్రీబోసు) చేసిన, చూపిన ఆశ్చర్యకరమైన ప్రయోగాలు చూస్తుంటే మనం (అంటే పాశ్చాత్యులందరూ) మన పాత ప్రపంచం విడచి మరో కొత్త ప్రపంచంలో ప్రవేశిస్తాము. మొక్కలు కేవలం మొక్కలు మాత్రమేనన్న దృష్టి పాతపడిపోయింది. మొక్కలు గూడ మనవంటి మానవులేనన్న గుర్తింపుగల కొత్త ప్రపంచం (–వాళ్ళకు కొత్త, మనలో తెలిసిన వారికి పాతదీ అయన) ప్రపంచంలో అడుగుపెడతాము. వాటికి గూడ మనలా (నరాల) నాడీ మండల ముంటుందనీ, అది గూడ వాటి జీవిత చరిత్రను వివరించగలవనీ ఆయన నిరూపించారు."

అంతేగాదు – మనం జడమని తలచే లోహాలకు గూడ జీవలక్షణాలున్నాయని – జీవమన్నది ప్రతి వస్తువు లోపల, బయటా గూడ వున్నదనీ గూడ ఆయన ఋజువు చేశాడు. ఈయన చేసి చూపిన ప్రయోగాల వలన– యోచనా శక్తి గల ఎవరికైనా – జీవమన్నది వేర్వేరు స్థాయిలలో అన్నింటిలోనూ వున్నదన్నది నిరూపణైందని శ్రీ అరవింద యోగి చెప్పారు. "చైతన్యము, క్రమము అన్నది పదార్థమంతటా వున్నదే గాని ఒక దశలో కాకతాళీయంగా ఏర్పడినది గాదు" అన్నారు. తర్వాత వియాన్నా నగరంలోని శాస్త్రజ్ఞులు జ.చ. బోసుగారి ప్రయోగాలు చూచి, "మేమేమి చేయడానికీ మీరేమీ మగల్చలేదే!" అన్నారు. ఆయనను ఫ్రెంచ్ పండితుడు రోమరోలా, "నూతన జగత్తునే కనుగొన్నవాడు" అని అభినందించాడు. ఈయన తమ స్వంత ప్రయోగశాలను నవంబర్ 30, 1907న మన దేశానికి అంకితం చేశారు.

# సాయిభక్తులకు శుభవార్త!

శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ రమణమహర్షి, శ్రీ శిరిడీ సాయినాథులు-ఈ ముగ్గురూ ఆధ్యాత్మిక విద్య అనే మూడు ప్రవాహాలు కలసిన "త్రివేణీ సంగమము" అని మాస్టర్‌గారు అనేవారు. అనేకసార్లు "శిరిడీ సాయి, శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ రమణమహర్షి నాకు ప్రమాణాలు" అనేవారు. తమ భక్తులను ఆ మహనీయుల చరిత్రలనూ, బోధలనూ చదవమని ప్రోత్సహించేవారు. కానీ గురుభంధువులెందరో ఆ విషయం తెలియక అట్టి అద్భుత ఆధ్యాత్మిక సూచనను అందుకోలేకున్నారు. కనుక అందరికీ ఈ గ్రంధాలను అందజేయాలనే సంకల్పంతో శ్రీ మంగభరద్వాజ ట్రస్ట్ ద్వారా Feb 9th నుండీ శ్రీ మాస్టరుగారి గ్రంధాలతోపాటు పై మహనీయులకు సంబంధించిన గ్రంధాలు అందించబడుతున్నాయి.

శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి కుమారుడు ద్వారకనాథ్, అనేక సందర్భాలలో శ్రీ వివేకానందుల గురించి, వారి జీవితము, బోధలగురించి ప్రస్తావిస్తుంటారు. పూజ్య శ్రీ మాస్టరుగారు తమ సంభాషణలలోనూ, రచనలలోనూ వివేకానందుని ప్రస్తావించి, ప్రశంశించిన సందర్భాలనూ, శ్రీ రామకృష్ణులంతటి మహనీయులు శ్రీ వివేకానందుని గూర్చి అన్న విషయాలనూ ద్వారకనాథ్ చెబుతుంటారు.

"గురుదేవులు ఆశించినట్లు మనం ఆచరిస్తే మనం ఎలా ఉంటామో, ఎలా ఉండాలో అన్నదానికి మచ్చుతునక శ్రీ వివేకానందులు. అటు సత్యాన్వేషణ నుంచి ఇటు గురుభక్తివరకూ, అకుంఠిత దీక్ష-వైరాగ్యము మొదలైన సద్గుణాలు, వ్యక్తిగత సాధన, గురుసేవ, సమాజసేవలదాకా గురుదేవులు మనలో ఏవైతే ఆశించారో, ఎట్టి జీవితాన్నైతే నిర్దేశించారో అట్టిది వివేకానందునిలో దర్శనమిస్తుంది" అంటూ వివరిస్తారు ద్వారకనాథ్.

అందుకని ఆయనను అడిగి వివేకానందుని గూర్చి చదవవలసిన గ్రంధాలను తెలుసుకుని అవికూడా గురుబంధువులందరికీ అందజేయడం జరుగుతున్నది. మావద్ద లభించే పై చెప్పిన గ్రంధాలు:-

## Books on Sri Ramakrishna Paramhansa and Swami Vivekananda

### Books in Telugu

| | |
|---|---|
| శ్రీ రామకృష్ణ బోధామృతము | 25.00 |
| నా భారతం నా అమర భారతం | 20.00 |
| జ్ఞాన యోగం | 30.00 |
| బుద్ధి యోగం | 15.00 |
| కర్మ యోగం | 15.00 |
| శ్రీ రామకృష్ణ కథామృతం-2 | 120.00 |
| స్వామి వివేకానంద (2 భాగాలు ) | 60.00 |
| మహాభారతం | 5.00 |
| నా అమర సందేశం | 30.00 |
| భక్తి యోగం | 10.00 |
| సందేశ తరంగిణి(కొలంబో-అల్మోరా) | 40.00 |
| వివేక సూర్యోదయము | 20.00 |
| దైవంతో సహజీవనం | 100.00 |
| భగవంతుని సన్నిధిలో భక్తులు | 80.00 |
| శ్రీ వివేకానంద లేఖావళి | 25.00 |
| రామాయణం | 5.00 |

### Books in English

| | |
|---|---|
| My Idea of Education | 34.00 |
| Karma Yoga | 18.00 |
| God Lived with Them | 170.00 |
| The Lived with God | 140.00 |
| Raja Yoga | 36.00 |
| Bhakti Yoga | 16.00 |
| Jnana Yoga | 50.00 |
| Letters of Swami Vivekananda | 110.00 |
| Reminiscences of Swami Vivekananda | 100.00 |
| Talks with Swami Vivekananda | 58.00 |
| Complete Works of Swami Vivekananda-vol.9 | 110.00 |
| Meditation and Its Methods | 18.00 |
| Vivekananda on Himself | 100.00 |
| Ramakrishna and Vivekananda | 7.00 |
| Tales and Parables of Sri Ramakrishna | 45.00 |
| Lectures from Colombo to Almora | 40.00 |
| Complete Works of Swami Vivekananda(8 volumes) | 450.00 |
| Sayings of Sri Ramakrishna | 25.00 |

ఈ గ్రంధములన్నీ గురుబంధువులందరూ చదివి ఆచార్యులు ఆశించిన ఆధ్యాత్మిక పురోభివృద్ధి సాదించాలని భగవంతునికి ప్రార్థన.

- డా॥ జి.వి. రావు (Founder and Managing Trustee, SMBT)
- డా॥ ఆర్.ఎస్. శశిధర్ (Trustee,SMBT)
- జి.సాయి ప్రసన్న కుమార్ (Trustee,SMBT)



# సర్వము తానైన శ్రీ సాయినాధ జై జై !!
# సాయియే తానైన శ్రీ భరద్వాజ జై జై!!

– ద్వారకానాథ్

పై పంక్తులు గురుదేవుల గూర్చి అమ్మ రాసిన పాటలోనివి.

సర్వము అంటే జీవితం మొత్తమూ అనీ, మనకు జీవితమంతా అనేక అనుభవాలను అందించే ప్రకృతి మొత్తమూ అని, మనతో సహా మనం చూసేదంతా (చూడనిది కూడా) అని అర్థం. అదే భగవంతుడన్నారు మహనీయులు. అదంతా తానని నిరుపించారు శ్రీ సాయి. తానే అంతటివార్రై మనకు (అందరికీ) ఈ విషయాన్ని తెలిపారు శ్రీ భరద్వాజులు. ఆ విషయాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొవటమే జీవిత పరమావధి అని తిరిగి తిరిగి ఆయన బోధించారు.

ఆధ్యాత్మికత అంటే వయసుమళ్ళి ముసలితనం వచ్చాక మరేమీ పనిలేదుకనుక పొద్దుపుచ్చడానికి చేసేది అనే అభిప్రాయం మనభారతావని ముద్దుబిడ్డలకుండటం విషాదకరం. ఏది కొరవైతే జీవితం దుర్భరమవుతుందో, ఏది లేక మానవతే ఉండదో అట్టి ఆధ్యాత్మికత ప్రజాజీవితంలో చివరి పేజీలకు నెట్టబడిందంటే అది జాతి క్షీణతకు తార్కాణం. ఆధ్యాత్మికత అంటే అట్టిది కాదని, జీవితం యావత్తూ అంకితం చేయదగినదని, అది వ్యక్తిగత సామాజిక జీవితంలో మనమెదుర్కొంటున్న సమస్యలన్నిటికీ ఏకైక పరిష్కారమని నొక్కి వక్కాణించిన వారు మన గురుదేవులు భరద్వాజ మహరాజ్.

యవ్వనం మొదలు వారి ఆచరణంతా పై విషయాన్నే నిరూపించింది. నూనూగు మీసాల వయసులో తీవ్ర సత్యాన్వేషణ, ఆ పైన తీవ్ర సాధన, మహాత్ముల దర్శనము, సేవనము, అటుపై శ్రీ సాయి ధర్మ ప్రచారము నిర్విరామంగా సాగించిన మస్టారుగారు మనకు చెప్పి, చేసి చూపినది అదే. అలా అని వారు "లౌకిక జీవితంలో నెగ్గలేదా?" అంటే వారి జీవితం మొత్తం ఎంతటి పచ్చి లౌకికుడినైనా ఆకర్షించేలా ఉంటుంది. ఎంతో చిన్న వయసులోనే చదువు పూర్తి చేయటం, IAS లాంటివి సాధించడం–లెక్చరర్‌గా పనిచేయటం, మేధావిలోకంచే ఎంతో కీర్తించబడటం, సాటివారిచే గౌరవించబడటం, సామాన్య ప్రజానీకంలో పూజనీయస్థానాన్ని అలంకరించడం, ఎన్నో వెలకట్టలేని గ్రంథాలు రచించడం, ఉపన్యాసాలు ఇవ్వటం, చక్కని ఆదర్శప్రాయమైన జీవితాన్ని ఎంతో ప్రశాంతంగా గడపడం, మహాత్ముల ఆదరణను, అభిమానాన్ని పొందడం– ఇవన్నీ ఎంత లౌకికులకైనా అందడం లేదు. అదంతా ఎంతో నేర్పుతో, హాయిగా ధర్మంగా సాధించారు భరద్వాజులు. ఎంతటి కష్టమొచ్చినా జంకక విజయాలను సాధించారు వారు. ఇదే కదా మనమందరమూ కోరుకునే జీవితం? మన పిల్లలకు మనం ఇలాంటి జీవితాన్నే కదా ఆశించేది?

మరి ఆయన ఇవన్నీ ఎలా చేసారు? ఎలా సాధ్యమైంది? మేమెలా సాధించాలి? అని వారిని అడిగినా, వారి గ్రంథాలలో వెదికినా, వారి చరిత్రను చూసినా ఒక్కటే సమాధానం. "ఆధ్యాత్మికత". మనమట్టి జీవనాన్ని అవలంబిస్తేకానీ అవేవీ సాధ్యంగావని అర్థమవుతుంది. పిల్లలకు ఉగ్గుపాలతో నేర్పితే కానీ సాధ్యం కాదని తెలుస్తుంది. జీవితంలో ప్రతి అడుగూ ఆధ్యాత్మికంగా వేయగల్గడమొక్కటే చక్కని జీవితానికి మార్గం. అది తప్ప–వేరేదేదీ పని చేయదనటానికి మనమందరమూ ఉదాహరణ.

మనమందరమూ వారిలా తయారు అవ్వగలిగితే తప్ప (ఏజన్మకైనా) సుఖ, శాంతిమయ, వ్యక్తిగత–సామాజిక జీవనం వీలుకాదు. అలా చేయనిదే ఎన్ని ఆస్తులు ఇచ్చినా, ఎంత పెద్ద ఉద్యోగము ఇచ్చినా, ఎన్ని పదవులొచ్చినా శాంతిగా జీవించడం ఎవరికీ వీలుకాదు. అందుకని మన పిల్లలకు అట్టి చక్కని జీవితాన్ని ఏర్పరచుకునే సౌకర్యాన్ని కలిగించాలి. లేకుంటే వారి జీవితాన్ని నాశనం చేసినవారమవుతాము.

చక్కని నడవడి, మానవత్వం, దైవీ సంపద, తెలివి, ధైర్యం, నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, ధర్మనిరతి–ఇవేవైనా మన పిల్లలలో అంకురించాలంటే రెండే మార్గాలు. మనం (తల్లి తండ్రులం) అవన్నీ సంపూర్ణంగా కలిగి వారికి ఆదర్శప్రాయిలమై వారిలో అవన్నీ కలిగించటం ఒకటి. లేదంటే (అవన్నీ మనకు లేవుకనుక) పిల్లలకు ఆదర్శాలుగా మాస్టరుగారి వంటి మహనీయులను చూపి వారు చెప్పిన మార్గంలో ప్లిలలను పెంచడం. మధ్యేమార్గం మరొకటి లేదు.

అంటే మాస్టరుగారు చెప్పినట్లు ఉగ్గుపాలతో ఆధ్యాత్మికత నేర్పటం, మహాత్ములను వారి బోధలను ప్రాధమిక విద్యగా పిల్లలకు అందించడం, వారి ఆధ్యాత్మికతకు, సాధనకు తగిన వాతావరణాన్ని ఇంట్లో కల్పించడం, వారిని సాధనలో ప్రోత్సహించడం చేయక తప్పదన్నమాట.

Feb 9th 1963లో శిరిడీ సాయి సన్నిధిలో గురుదేవులకు అత్యున్నతమైన ఆధ్యాత్మికానుభూతి కలిగింది. ఆ తరువాతనే వారు మనకు ఇంతటి అద్భుత విధానాన్ని, సాటిలేని సద్గురువైన శ్రీ సాయిని అందించారు. ఆరోజు ఆయనకు కలిగిన అనుభవాన్ని, దానికి ముందు జరిగిన సత్యాన్వేషణను వారు ఈ

విధంగా వివరించారు :

భగవద్గీత ఎందుకు చదువుకోవాలి? ఉపనయనం ఎందుకు చేసుకోవాలి?" అన్న ప్రశ్నలతో నా మానసిక జీవతం ప్రారంభమైంది. ఒక వయస్సు వరకూ అందరి పిల్లలలాగా, చెప్పింది చదువుకున్నాను. నా 15వ యేట మా నాన్నగారు నేను భగవద్గీత చదువుకోవడం గురించి, నా ఉపనయనం గురించి ప్రస్తావించినపుడు నేను వేసిన ప్రశ్నలు అవి. అంతటితో ఆయన తాత్కాలికంగా ఆ ప్రయత్నం విరమించుకొన్నారు. తరువాత నాకై నేనే అందులో ఏముంటుందోనని, అందరూ ఆయనచేత భగవద్గీత చెప్పించుకుంటుంటే వినేవాడిని. అలానే ఒకప్పుడు ఉపనయనంగూడ చెయ్యమని అడిగాను. కారణం అందులో ఏముందో ఇంకొకరిని అడిగేకంటే, నాకై నేనే తెల్సుకోవడం మంచిదనిపించింది.

నా16వ ఏట నా మమతను చూరగొన్న 2సం॥ల భాస్కరాచార్య మా పెద్దన్నగారి అబ్బాయి – చనిపోయాడు. అదీ సరిగ్గా నా ఉపనయనం రోజున, బ్రహ్మోపదేశ ముహూర్త సమయానికే! తర్వాత నా మానసిక పరివర్తన దృష్ట్యా చూస్తే ఆ విషాదకరమైన సంఘటనే నిజమైన ఉపదేశంగా పరిణమించిదనిపిస్తుంది. ముందు కొద్ది రోజులు తీవ్రమైన శోకానికి గురైనాను. కాని ఆ తర్వాత నా అన్నగారి బాధను, అంతకంటే గూడ వదినగారి బాధను చూస్తుంటే నా బాధను మర్చిపోయాను. వారి బాధను ఎట్లా తీర్చవచ్చా అని అతి తీవ్రంగా ఆలోచించాను. అసంఖ్యాకంగా మానవులు చనిపోతూనే వున్నా, వైద్యులు దగ్గర నుంచీ అందరూ ఇంతకాలం నిస్సహాయులవడం చూస్తుంటే 'మృత్యువును అతిక్రమించే మార్గమే లేదా?' అన్న ప్రశ్న తలెత్తడమేగాక ఏదో అంతర్నిహితమైన ఒక అంతస్ఫూర్తి, 'మార్గం వున్నా వీరు గుర్తించలేదేమో!' అని హెచ్చరించి నన్ను అన్వేషించమని ప్రోత్సహించింది. జీవించడము, ప్రాణము అంటే ఏమిటో తెలిస్తేగాని ఆ ప్రశ్నకు సమాధానం దొరకదని తోచింది. ప్రశ్న మరింత విస్తరించి 'జన్మించిడం అంటే ఏమిటి? ప్రాణం ఎక్కడనుండి వస్తుంది? ఎక్కడికి పోతుంది? జన్మించిన ప్రతివాడు వృద్ధుడై చనిపోయి తీరవలసినట్లుగా విధించే కాలగతి రూపం ఏమిటి? దాన్ని నిరోధించడం సాధ్యమా?' ఇట్లా సాగింది అన్వేషణ. యోగము, తపస్సు మొదలైన వాటిల్లో నా ప్రశ్నలకు సమాధానం దొరకవచ్చేమోగాని, ఈనాటి వైజ్ఞానిక పరిజ్ఞానం చాలదని తోచింది. అంతటితో అహర్నిశలూ నన్ను నేనే ఎన్నో ప్రశ్నలు వేసుకుంటూ, ఎన్నో గమనిస్తూ ఆలోచిస్తూ కాలం గడిపాను. ఈ అన్వేషణలో సుమారు నాలుగైదు సంవత్సరాల వరకూ నేను ఏ పుస్తకాలూ చదవలేదు. ఎవరినీ ఏమీ అడగలేదు. కేవలం నాకప్పటికున్న పరిజ్ఞానాన్ని, తార్కికశక్తినీ వినియోగించి అహర్నిశలూ యోచించడమే నాపని. అలా చేయడంలో నా ఉద్దేశ్యము చెబుతాను – పుస్తకాలలో చెప్పబడ్డ వాదాలచేత ప్రభావితంగాకుండా స్వయంగా సత్యాన్ని తరచడం ఒకటి. ఇంకొక కారణం ఎంతగొప్ప మేధావంతుని మేధస్సుకు తట్టిన ఆలోచనైనా అంత తీవ్రంగా మనమూ కృషిచేసి మన మనస్సును ఆ స్థాయికి తీసుకొనివస్తే మనకు దానంతటదే తెలుస్తుంది కదా? కొన్ని సంవత్సరాలపాటు జరిపిన నా అన్వేషణతో నాకు సందేహములేని సమాధానాలను ఏర్పరచుకొన్నాక, అప్పుడు నా యోచనా విధానంలోగాని, సాధించిన అభిప్రాయాలలోగాని ఏ లోపముందో చూచుకోడానికి పుస్తకాలు చదవడం ప్రారంభించాను. ఎక్కడా ఒక్క విషయంలోనూ నా అభిప్రాయం మార్చుకోవలసిన అవసరము రాలేదు. ఆయా పుస్తకాలలో నాకొచ్చిన భావాలే ధృవపరచబడి వుండడం నాకు సంతోషాన్ని, ఆత్మవిశ్వాసాన్నీ యిచ్చింది. చివరకు 1961లో ఒకరోజున ఊరి బయటకు నడుస్తుండగా, నాటివరకు నేను చదివినవి. ఆలోచించినవి అన్నీ సమన్వయమైన ఒకానొక గాఢమైన శాంతి కల్గింది.

నా మనస్సులో చిక్కు వీడినట్లై ఒక తార్కిమైన సిద్ధాంతం రూపొంది, అన్నింటిని సమన్వయ పరుస్తూ, సమాధానపరచినట్లనిపించింది. అట్లా మరి ప్రశ్నలు లేని శాంతమైన మనస్సుతో కొంతకాలం గడిచింది. అయినా కేవలం మానసిక (Speculative or Theoretical) సమాధానంతో తృప్తి పడక, జీవానికి, జీవితానికి, ప్రాణానికి, 'నా'కూ అతి సన్నిహితమైన ఉదాహరణగా నన్నే తీసుకొని నా మనస్సును, నా చైతాన్యాన్ని గమనించే యత్నంచేసేవాణ్ణి. ఒక శూన్యము, శాంతమూ అయిన స్థితిని అనుభవిస్తుండే వాణ్ణి. ఆ శాంతిలోంచి మనస్సు బహిర్ముఖమై, నాప్రశ్నలు ఎంతవరకూ సమాధానపడ్డాయో చూచుకొన్న సమయంలోనే అసలీ మానసిక సమన్వయం గూడ వచ్చింది. అయితే మృత్యువును, కాలాన్నీ జయించే శక్తి నాకు రాలేదు గనుక నాప్రయత్నం పూర్తికాలేదని తెలుసు. ఇంకా చేస్తే ఇంకా బాగా మనస్సుకు తెలాయడమేగాక నా శక్తి పెరుగుతుందని ఆలోచిస్తూండే వాణ్ణి. అప్పటికి 1959లో నేను ఒంగోలు కాలేజీలో మొదటసారిగా ఉపాధ్యాయ వృత్తిలో చేరాను. ఒక సాయంత్రం రైలు స్టేషన్‌లో పుస్తకాల షాపు దగ్గరికెళ్ళినపుడు "The Way of Zen" అన్న పుస్తకం తీసి నాకిస్తూ, 'ఇది మీలాంటివారు చదువవలసినది అంటూ ఆ షాపులోని వ్యక్తి, ఒక మిత్రుడు ఇచ్చారు. ఆ పుస్తకంలోని విషయమంతా నా అన్వేషణలతో పోలి ఉండటమేగాక, నా అభిప్రాయాలను, అనుభవాన్నీ ధృవపరిచింది. బుద్ధుడు తన అన్వేషణ సరిగ్గా ఈ ప్రశ్నలతోనే ప్రారంభించిన విషయం నా మనస్సును ఉత్తేజపరచి, బౌద్ధగ్రంధాలు చదివించింది. అట్లా మత గ్రంధాలు చదవడం మొదలెట్టాను. ఆయా సత్యాలను అనుభవపూర్వకంగా తెలుసుకున్న మహాత్ముల చరిత్రలు, సాధనలు వారి అనుభవాలు గురించి చదివాను. ఇది నా అన్వేషణలో

రెండవ మలుపు.

మహాత్ముల చరిత్రలు చదువుతున్నా, ఆ స్థితులను పొందాలనిగాని, పొందగలననిగాని అప్పుడు తోచక, తాత్కాలికంగా మానసికమైన మాంద్యావస్థలో వుండి, కేవలం వారి అనుభవం నుండి మృత్యువేమిటా అని ఆలోచించాను. అదీ నా భావాలకు అంత భిన్నంగా వుండక పోవడం నాకు ఆశ్చర్యానందాలను కలిగించింది.

Edward Conze సంకలనం చేసిన 'Buddhist Scriptures' అన్న గ్రంథంలో, బోధిసత్వుడు జన్మజన్మలుగా ఎలా బుద్ధత్వం వైపుకు పురోగమిస్తాడో చెబుతూ, ఇటువంటి సృష్టి రహస్యాన్వేషణ వైపుకు పూర్వ సంస్కారం వల్ల తనకై తానే తర్వాత జన్మలలో లాగబడతాడని చదువుతుండగా, నేనూ అటువంటి అన్వేషకుణ్ణేమోనని, అందుకే అంత తీవ్రంగా అన్ని సంవత్సరాలు విడవకుండా ఆ ప్రశ్నలను పరిశోధిస్తున్నానేమోనని తోచేసరికి నా జీవితానికి ఒక లక్ష్యం వుండాలని, అది ఈ అన్వేషణే కావాలని నేను గత జన్మలలో అన్వేషకుణ్ణి అయినా కాకపోయినా ఇదే యోగ్యమని తోచింది. అయితే ఈ బౌద్ధ గ్రంథ పఠనంవల్ల, స్వయంకృషి మీదనే పురోగతి అంతా ఆధారపడుతుందన్న భావం దృఢమైంది.

ఫిబ్రవరి 1963లో మా రెండవ అన్నయ్య నన్ను తనతో శిరిడీ రమ్మన్నాడు. అతి లౌకిక స్థితి ఏదైనా పొందవలసినది, పొందదగినదీ వున్నా గూడ అది స్వయంకృషి మీద ఆధారపడి వుంటుందని, అటువంటప్పుడు ఏ సాయిబాబా వంటి మహనీయుడూ మరొకరికే సహాయమూ చేయలేరని, అందువల్ల శిరిడీ వెళ్ళడం వల్ల ఏమీ ప్రయోజనం వుండదని, నేను రాననీ చెప్పాను. ఒకవేళ స్వయంకృషిగాక మరేదైనా మార్గముంటే అది దైవనిర్ణయం అని, ఆ దైవ నిర్ణయం మనకూ వుంటే మనమూ ఆ స్థితిని పొందగలమని, ఆ నిర్ణయం లేనప్పుడు మహాత్ముని దర్శనం వల్ల కూడా ప్రయోజనముండజాలదనీ వాదించాను. నా వాదంతో తనకు పనిలేదని, నన్ను నమ్మమని అడగడం లేదని, కేవలం తోడుగా శిరిడీ రమ్మనీ చెప్పి అన్నయ్య నన్ను శిరిడీ తీసుకెళ్ళారు. ఫిబ్రవరి 8 సాయంత్రం అప్పటి సమాధి మందిరంలో మేము ప్రవేశించేసరికి ఆరతి జరుగుతోంది. అది చూచి ఏనాడో పరమపదించిన వ్యక్తిమీద ప్రజలకు అంత భక్తివిశ్వాసాలు వుండడం ఆశ్చర్యమనిపించింది. ఆరతి అయ్యాక అన్నగారు నాకు అప్పటి అరుగును చూపి అది బాబాసమాధి అని చెప్పగానే నాకెంతో వెగటు అనిపించింది. "ఆ శరీరం ఎంతగా కుళ్ళి వుంటుందో!" అని తోచి, కడుపులో త్రిప్పినట్లయి, వెంటనే గదికి వెళ్ళి అన్నంగూడ తినకుండా నిద్రపోయాను.

తెల్లవారి తీవ్రమైన ఆకలితో మెలుకువ వచ్చి త్వరత్వరగా మద్రాస్ హోటల్‌కని సమాధి మందిరం మీదుగా వెళుతున్నాను. ఆరతి, అభిషేకం అయిపోయాయి కాబోలు, అక్కడ పూజారులు తప్ప మరెవ్వరూ లేరు. జీవకళతో కళకళలాడుతున్న అప్పటి విగ్రహాన్ని మాత్రం మరొక్కసారి చూడాలనిపించి,మందిరంలోకి వెళ్ళాను.

వెళ్ళి చూస్తుండగా ఆయన మనోవైఖరిని, స్వభావాన్నీ, కవళికలను బట్టి అంచనా వెయ్యచూచాను. దానితో నా దృష్టి ఆయన మీద కేంద్రీకృతమై అతివేగంతో భావపరంపరలు – భాషలో ఇమడనివి నా మనసులో పరుగెత్తాయి.

ఆ విగ్రహంలోని బాబా ముఖం చూస్తుంటే అందులోని సాయిచూపు అంతర్ముఖమై, ఏదో అతీతమైన స్థితిలో వున్నట్లు తోచింది. ఆ స్థితిలో ఆయనకు తననుండి వేరుగా యీసృష్టి వున్నట్లు తోచివుండదని, విశ్వమంతా ఏ మహత్తర చైతన్యంలో సంకల్పమాత్రంగా వున్నదో, దానితో ఆయన తాదాత్మ్యం చెంది వున్నారనిపించింది. ఇది కేవలం భావంగాగాక ఒక అనిర్వచనీయమైన అనుభవంగా నా హృదయాన్ని కబళించింది. నాచుట్టూ, నా లోపల ఏమి జరుగుతున్నదో తెలియలేదు.

తన్మయావస్థ కలిగి ధ్యాన నిష్ఠలో వున్న సాయి మనస్సులో ఈ విశ్వమంతా భావనామాత్రంగా తోచింది. ప్రతి వస్తువు, ప్రాణి ఆ మనస్సుతో చేయబడిన కల్పనగా తోచాయి. ఆ కారణంగా బాబా చైతన్యం సర్వవ్యాపకమనీ, సర్వజ్ఞమనీ తోచింది. ఆ భావాలలో నేనూ ఒక భావాన్నని, బాబా తత్త్వమే నా తత్త్వమనీ తోచి నాకు తెలియకనే కళ్ళు మూతపడి ఒక వింతైన ఆనందంతో పులకింత కలిగి మనస్సు ఆ భావంలో నిలచిపోయింది.

అలా ఎంతసేపు గడిచిందో తెలియలేదు. కొంతసేపటికి త్రుళ్ళిపడి లేచాను. మా అన్నగారు నా వీపు తట్టి భోజనానికి రమ్మంటున్నారు. ఆ స్థితిలోనుంచి మేల్కొనడమెంతో బాధనిపించింది. టైము చూస్తే నేనక్కడకు వచ్చి సుమారు 5 గంటలైంది. అంతసేపూ నేను నిలబడి విగ్రహాన్ని చూస్తున్నాననుకొన్నాను; నిజానికి కూర్చుని వున్నాను. కళ్ళు మూతబడి వున్నాయి. భోజనానికి వెళుతూ వుంటే కలలో నడుస్తున్నట్లుంది. గాఢనిద్రలో లేపితే తిరిగి మనస్సు నిద్రలోకి మళ్ళినట్లు, నా మనస్సు అప్రయత్నంగా నిరామయమౌతున్నది. వస్తువులను గుర్తించాలన్నా, యోచించాలన్నా, ఎంతో ప్రయత్నం చేయవలసి వస్తున్నది. ఇల్లు చేరి కొద్ది నెలలు గడిచినా నా స్థితి అలానే వుండిపోయింది. గాఢమైన శాంతి ఆనందాలతో రోజులు, నెలలు క్షణాల్లా గడిచిపోయేవి.

ఒక విశేషమేమంటే, ఆ తర్వాత చాలాకాలం వరకూ నన్ను పలుకరించని క్షణాలల్లో శ్రీసాయి విగ్రహం మనస్సులో మెదలి, తిరిగి అవే భావాల పరంపరలు మెదలి, అదే ఆనందాన్ని నా మనసు పొందేది. తిరిగి హైద్రాబాద్ వచ్చాక నాలో నాకే అర్థంగాని విశేష ప్రజ్ఞ మేల్కొన్న సూచనలు చాలా వచ్చాయి.

*జగత్తంతా చైతన్యమయంగా తోచేది. దాని వలన నా ఉద్యోగవిధులు దెబ్బతినకుండా కొన్ని ఆటలు నేర్చుకొని ఆడుతుండేవాణ్ణి. నా శరీర తత్త్వంలో గూడ ఎంతో మార్పు వచ్చింది. దృఢమైన ఆరోగ్యం కల్గింది. ఎంత తింటే అంత తిరిగేది; ఏమి తినకున్నా నీరసమూ, ఆకలి ఉండేది కాదు. ఎప్పుడు పడుకున్నా గాఢంగా నిద్ర పట్టేది. కొన్ని రోజులు నిద్ర లేకపోయినా కళ్ళు మంటలు, ఆవలింతలూ వుండేవి గావు. ఎటువంటి ఆధ్యాత్మికమైన ప్రశ్న వచ్చినా తృటిలో సమాధానము స్ఫురించేది. ఎవరినైనా చూడాలనిపిస్తే త్వరలో వారే రావడం జరిగేది. ఇతరుల గురించి సామాన్యంగా తెలియడానికి వీలులేని అంశాలు అకస్మాత్తుగా నా మనస్సులో మెరిసేవి. నా పరిచయస్తులందరూ నాదగ్గర తమకెంతో శాంతిగా వుంటుందనేవారు.*

*కొన్ని నెలలు గడిచాక క్రమంగా మనస్సుకు సాయి విగ్రహం గోచరించడం తగ్గుతూ వచ్చింది. అయినా గురువారం ఉదయం మాత్రం నిద్ర మెలకువ రావటం ఆ స్మరణతోనే జరిగేది. ఆ గుర్తుతో నేను గురువారాన్ని గుర్తించగలాగేవాణ్ణి. అప్పటినుండి బాబా పటాన్ని పూజలో పెట్టుకొని, ఒక్క అగరొత్తి పెట్టి, ఊరికే ఆయన చిత్రం కేసి తదేక ధ్యాసతో చూస్తుంటే మనస్సు ఏదో పరమానందాన్ని పొందుతూ ఉదయం 9,10 గంటల నుంచి సాయంత్రం 4,5 గంటల వరకు మరే కాలక్షేపమూ అవసరం లేకుండా గడిచేది".*

ఆయనకు ఆనాడు అంతటి అనుభవం కలిగింది. ఏ అనుభూతి కోసం మహర్షులు వేల సంవత్సరాలు తపస్సు చేశారో, దేని కోసమైతే నిజమైన సాధకులు తపిస్తారో అట్టి అనుభూతి వారు పొందారు. మనలనూ అదే పొందమని ఆదేశించి, ప్రోత్సహించి, మార్గం చూపి అనుగ్రహించారు. ఆ బాటలో పయనించడానికి మొదటి మెట్టుగా పై చర్చను పునరావలోకనం చేసుకుని దానికి తగ్గట్టుగా మన జీవితాలను మలచుకొని, పిల్లలకు అట్టి జీవితాన్ని అందించడానికి ప్రయత్నాన్ని ఆరంభించి కొనసాగించడం కన్నా మనము ఆయనను మెప్పించే విధానం మరొకటి లేదు. Feb 9th 2011ని పురసక్కరించుకుని, ఆ పర్వదినాన వారిని స్మరించి, స్ఫూర్తిని పొంది మనమందరమూ ఆధ్యాత్మిక వికాసం వైపుకు పయనించేలా అనుగ్రహించమని సర్వమూ తానైన భరద్వాజ మహరాజ్‌ను ప్రార్థిస్తున్నాను.


## Books on Sri Ramakrishna Paramhansa and Swami Vivekananda

### Books in Telugu

| | |
|---|---|
| శ్రీ రామకృష్ణ బోధామృతము | 25.00 |
| నా భారతం నా అమర భారతం | 20.00 |
| జ్ఞాన యోగం | 30.00 |
| బుద్ధి యోగం | 15.00 |
| కర్మ యోగం | 15.00 |
| శ్రీ రామకృష్ణ కథామృతం-2 | 120.00 |
| స్వామి వివేకానంద (2 భాగాలు ) | 60.00 |
| మహాభారతం | 5.00 |
| నా అమర సందేశం | 30.00 |
| భక్తి యోగం | 10.00 |
| సందేశ తరంగిణి(కొలంబో-అల్మోరా) | 40.00 |
| వివేక సూర్యోదయము | 20.00 |
| దైవంతో సహజీవనం | 100.00 |
| భగవంతుని సన్నిధిలో భక్తులు | 80.00 |
| మువివేకానంద లేఖావళి | 25.00 |
| రామాయణం | 5.00 |

### Books in English

| | |
|---|---|
| My Idea of Education | 34.00 |
| Karma Yoga | 18.00 |
| God Lived with Them | 170.00 |
| The Lived with God | 140.00 |
| Raja Yoga | 36.00 |
| Bhakti Yoga | 16.00 |
| Jnana Yoga | 50.00 |
| Letters of Swami Vivekananda | 110.00 |
| Reminiscences of Swami Vivekananda | 100.00 |
| Talks with Swami Vivekananda | 58.00 |
| Complete Works of Swami Vivekananda-vol.9 | 110.00 |
| Meditation and Its Methods | 18.00 |
| Vivekananda on Himself | 100.00 |
| Ramakrishna and Vivekananda | 7.00 |
| Tales and Parables of Sri Ramakrishna | 45.00 |
| Lectures from Colombo to Almora | 40.00 |
| Complete Works of Swami Vivekananda(8 volumes) | 450.00 |
| Sayings of Sri Ramakrishna | 25.00 |

**గ్రంధాలకొరకు-** Sri Manga Bharadwaja Trust, BhaktaNivas, 12-1-170/46P,Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 500 068. website: www.saibharadwaja.org, www.saimasterforums.org

**గమనిక**: -ఈ గ్రంధములపై **Discount** లభించదు.

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 50-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్థవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 10-00 |
| విజ్ఞాన వీచికలు | 40-00 |
| పరిప్రశ్న | 40-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 25-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 40-00 |
| బుద్ధధ్యాన హృదయం | 30-00 |
| దత్తావతార మహత్యం | 40-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 80-00 |
| పురుషసూక్త రహస్యం | 30-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 45-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 25-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 30-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 45-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 35-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 40-00 |
| మనము-మన సంస్కృతి | 55-00 |

## ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 35-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 40-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 55-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Guru Charitra | 70-00 |
| Supreme Master (Swami Samartha) | 60-00 |
| Sai Baba of Shirdi and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 60-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Chraitra (Kannada) | 99-00 |
| Swami Samartha (Kannada) | 45-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |
| Stavana Manjari (Tamil) | 3-00 |

SRI GURUPADUKA PUBLICATIONS
c/o, **Sri Manga Bharadwaja Trust,**
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**